ప్రతి అక్షరం - ప్రజల కోసం

# రోమింగ్ న్యూస్

తెలుగు దినపత్రిక

యాదాద్రి భువనగిరి

పేజీలు : 8
సంపుటి : 4
సంచిక : 194

శనివారం 31 జనవరి 2026 | చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్ | HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD

## ఇండియా- పాకిస్థాన్ మ్యాచ్‌కి సెక్యూరిటీ పెంచిన శ్రీలంక




7

# కేసీఆర్‌కు సిట్ షాక్

## మరోమారు నోటీసులు జారీ



### ఫామ్‌హౌజ్ విచారణ కుదరదని స్పష్టీకరణ

### నందినగర్ ఇంట్లోనే విచారిస్తామని వెల్లడి

### ఆదివారం 3గంటలకు విచారణకు సిద్ధంగా ఉండాలని నోటీస్

### న్యాయనిపుణులతో చర్చించి నోటీసులు ఇచ్చిన సిట్

**రోమింగ్ న్యూస్, హైదరాబాద్ :** ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బిగ్ షాక్ తగిలింది. సిట్ అధికారులు శుక్రవారం మరోసారి ఆయనకు నోటీసులు ఇచ్చారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కాకుండా హైదరాబాద్‌లోనే కేసీఆర్‌ను విచారించాలని నిర్ణయించారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు అందుబాటులో ఉండాలని తెలిపారు. కాగా, నిన్న (గురువారం) సిట్ అధికారులు కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చిన

మిగతా 2 లో

### కేసీఆర్‌కు నోటీసులపై బీఆర్ఎస్ నిరసన

## ఘనంగా మహాత్మాగాంధీ 78వ వర్ధంతి

### రాజ్‌ఘాట్ వద్ద నివాళి అర్పించిన రాష్ట్రపతి, ప్రధాని



మహాత్మా గాంధీ 78వ వర్ధంతి సందర్భంగా రాజ్ ఘాట్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్ర మోదీసహా పలువురు ప్రముఖులు గాంధీకి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖులు, రిటైర్డ్ అధికారులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులు కూడా పాల్గొన్నారు.

3

## హార్వర్డ్ వర్సిటీలో సీఎం రేవంత్ శిక్షణ

### వారం రోజుల సర్టిఫికెట్ కోర్సు పూర్తి




2

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికాలో ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ యూనివర్శిటీలోని కెన్నెడీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌లో ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌ను విజయవంతంగా పూర్తి చేశారు.



### తెలంగాణలో ముగిసిన మున్సిపల్ నామినేషన్ల ఘట్టం

భారీగా నామినేషన్లు వేసిన అభ్యర్థులు

సాయంత్రం క్యూలో ఉన్న వారికి అనుమతి

.. వివరాలు 2లో



### ఐపీఎస్ అధికారిపై ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు

క్షమాపణలు చెప్పాలని అధికారుల సంఘం డిమాండ్

బేషరతుగా క్షమాపణలు చెప్పిన కౌశిక్ రెడ్డి

.. వివరాలు 2లో



# హోరెత్తిన మేడారం



గద్దెలపై కొలువుదీరిన సమ్మక్క-సారలమ్మ

శివ సత్తుల పూనకాలతో హోరెత్తిన జంపన్నవాగు

మొక్కులు చెల్లించుకున్న రాష్ట్ర గవర్నర్, మంత్రులు, హైడ్రా కమిషనర్ రంగనాథ్

నిలువెత్తు బంగారం సమర్పించుకున్న బ్రిటీష్ హైకమిషనర్

2

# తెలంగాణ ప్రాజెక్టులకు పాతర

## చంద్రబాబుతో దోస్తీతో ఏపీకి లైన్ క్లియర్



3

నల్లమల సాగర్ ప్రాజెక్ట్ కోసం నాటకాలుడుతన్న రేవంత్

ఇరిగేషన్ మీటింగ్ బాయ్‌కాట్ చేయడం ఒక్కటే మేలు

రేవంత్‌ను ప్రజాక్షేత్రంలో ఎండగడతామన్న హరీష్ రావు

ఏపీ సీఎం చంద్రబాబుతో సీఎం రేవంత్‌రెడ్డి దోస్తీ కట్టి తెలంగాణకు అన్యాయం చేస్తున్నాడని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్‌రావు విమర్శించారు. చంద్రబాబుతో దోస్తీ కోసం రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న రేవంత్‌రెడ్డిని తెలంగాణ సమాజం క్షమించదని అన్నారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ప్రెస్‌మీట్ పెట్టి హరీష్‌రావు మాట్లాడారు.

## తెలంగాణ నీటి ప్రయోజనాలను వదులుకోం

పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టు పై చర్చే లేదు

హరీష్ రావు నిజాలు తెలుసుకుని మాట్లాడాలి

పదేళ్లలో సాగునీటి రంగాన్ని భ్రష్టు పట్టించిన బీఆర్ఎస్

మండిపడ్డ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



3

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శనివారం 31
జనవరి 2026







# హార్వర్డ్ వర్సిటీలో సీఎం రేవంత్ శిక్షణ

## వారం రోజుల సర్టిఫికెట్ కోర్సు పూర్తి

**హైదరాబాద్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికాలో ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ యూనివర్సిటీలోని కెన్నెడీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌లోఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. లీడర్ షిప్ అనే కోర్సును పూర్తిచేసి సంబంధిత ధ్రువీకరణ పత్రాన్ని పొందారు. జనవరి 25న ఈ కోర్సు ప్రారంభమవగా జనవరి 30 వరకు అంటే వారం రోజుల పాటు నిర్వహించారు. ఈ కోర్సులో సీఎం రేవంత్‌తో పాటు 62 మంది కోహోర్ట్ విద్యార్థులు కూడా పాల్గొన్నారు. దాదాపు 20కి పైగా దేశాల నుంచి ప్రతినిధులు ఇందులో భాగస్వాములయ్యారు. అమెరికాలోని కేంబ్రిడ్జ్‌లో మైనస్ 24 డిగ్రీల తీవ్ర చలిలోనూ రేవంత్ రెడ్డి ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తరగతులకు హాజరయ్యారు. కేస్ స్టడీలు, గ్రూప్ డిస్కషన్లు, కన్సల్టేటివ్ వర్క్‌లతో కూడిన ఇంటెన్సివ్ ప్రోగ్రామ్‌లో భాగంగా అధికారం, నాయకత్వం, సంఘర్షణలు, అనిశ్చితి వంటి అంశాలపై శిక్షణ పొందారు. ప్రోగ్రామ్ ముగిసిన సందర్భంగా హార్వర్డ్ అధ్యాపకులు రేవంత్ రెడ్డితో పాటు మిగిలిన 62 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అయితే భారతదేశ చరిత్రలో అధికారంలో ఉండగానే హార్వర్డ్ నుంచి ఈ రకమైన సర్టిఫికెట్ పొందిన తొలి ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి రికార్డ్ సృష్టించారు.

# తెలంగాణలో ముగిసిన మున్సిపల్ నామినేషన్ల ఘట్టం

## భారీగా నామినేషన్లు వేసిన అభ్యర్థులు

## సాయంత్రం క్యూలో ఉన్న వారికి అనుమతి

**హైదరాబాద్ :** తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల గడువు ముగిసింది. ఆఖరి రోజు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు నామినేషన్‌ల దాఖలుకు గడువు మగియగా.. అప్పటికే క్యూలైన్‌లలో ఉన్నవారు నామినేషన్‌లు వేసేందుకు అనుమతించారు. శనివారం అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. నామినేషన్‌ల ఉపసంహరణకు ఫిబ్రవరి 3 వరకు గడువు విధించారు. కాగా ఫిబ్రవరి 11న రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు పోలింగ్ జరగనుంది. మొత్తం 2,996 వార్డులు, డివిజన్లకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి 13న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు. మున్సిపల్ ఎన్నికల ఫిర్యాదులకు రాష్ట్ర ఎన్నికల సంఘం 'టీఈ పోల్' మొబైల్ యాప్ ఏర్పాటు చేసింది. వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదులకు అవకాశం కల్పించినట్టు ఎస్ఈసీ తెలిపింది. చివరి రోజు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. సాయంత్రం 5 గంటలకు నామినేషన్ గడువు మగియగా.. అప్పటి వరకు క్యూలైన్‌లో ఉన్న వారిని నామినేషన్ వేసేందుకు అనుమతించారు. శనివారం అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన జరగనుంది. ఫిబ్రవరి 3 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది.అదే రోజు ÷నైల్ అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తుంది ఈసీ. మొత్తం 2,996 వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తుండగా.. 8203 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఓట్ల కౌంటింగ్ కోసం 136 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి 3 వరకు విత్ డ్రాలు నిర్వహించి అదే రోజు అభ్యర్థులకు గుర్తులను కేటాయిస్తారు. ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో 48 గంటల ముందే ప్రచారం ముగుస్తుంది. అంటే వచ్చే ఫిబ్రవరి 9వ తేదీన ప్రచారం బంద్ అవుతుంది. ఈ లెక్కన అభ్యర్థులు కేవలం ఆరు రోజులు మాత్రమే ప్రచారం చేయాల్సి ఉంటుంది. చివరిరోజు గజ్వేల్‌లో బిజెపి అభ్యర్థి నామినేషన్‌లో మెదక్ ఎంపి రఘునందన్ రావు పాల్గొన్నారు. పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

# ఐపీఎస్ అధికారిపై ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు

## క్షమాపణలు చెప్పాలని అధికారుల సంఘం డిమాండ్

## బేషరతుగా క్షమాపణలు చెప్పిన కౌశిక్ రెడ్డి

**హైదరాబాద్,జనవరి30:** తెలంగాణ ఐపీఎస్ అధికారుల సంఘానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి బేషరతుగా క్షమాపణలు చెప్పారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'ఎవరినీ ఉద్దేశ్యపూర్వకంగా అన్న మాటలు కాదు.. మనోభావాలు దెబ్బతింటే క్షమాపణలు చెబుతున్నాను. సీఎం రేవంత్ రెడ్డి ప్రోత్బలంతో నాపై, నా కుటుంబం పై రాజకీయ కక్షకు తెగబడ్డారు. పోలీసులు, అధికారులు అంటే నాకు ఎంతో గౌరవం ఉంది. కానీ కొందరు.. మేము సమ్మక్క జాతరకు వెళ్తున్న క్రమంలో అడ్డుకొని, తీవ్ర ఒత్తిడికి గురి చేశారు. ఆ ఫ్రస్టేషన్, ఒత్తిడిలో తెలియకుండా నోరు జారాను. అంతే తప్ప ఉద్దేశ్య పూర్వకంగా అన్న మాటలు కావు. నా మాటలతో ఎవరివైనా మనోభావాలు దెబ్బతింటే వారికి నా క్షమాపణలు తెలియజేస్తున్నాను. ఈ విషయంలో కొందరు పనిగట్టుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ వివాదాన్ని ఇంతటితో ముగించాలని అందరిని వేడుకుంటున్నాను.' అని అభ్యర్థిస్తూ కౌశిక్ రెడ్డి వీడియో విడుదల చేశారు. గురువారం నాడు వీణవంకలోని స్థానిక సమ్మక్క సారలమ్మ జాతరకు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కుటుంబ సమేతంగా వెళ్లారు. ఆ సమయంలో పోలీసులకు, కౌశిక్ రెడ్డికి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సహనం కోల్పోయిన కౌశిక్ రెడ్డి.. ఐపీఎస్ అధికారిని మతం పేరుతో దూషించారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర ఐపీఎస్ అధికారుల సంఘం.. కౌశిక్ రెడ్డి తీరును తీవ్రంగా ఖండించింది. ఆయన చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని.. వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో స్పందించిన కౌశిక్ రెడ్డి.. పోలీసులకు క్షమాపణలు చెబుతూ ఎక్స్ వేదికగా వీడియో విడుదల చేశారు. తన వ్యాఖ్యల పట్ల వివరణ ఇచ్చారు. తన క్షమాపణల అనంతరం ఈ వివాదాన్ని ఇక్కడితో ముగించాలని కౌశిక్ రెడ్డి కోరారు. అయితే ఐపీఎస్ అధికారిపై బీఆర్ఎస్ హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ ఐపీఎస్ అధికారుల అసోసియేషన్ పేర్కొంది. మతం పేరుతో ఆరోపణలు చేయడం దారుణమని చెప్పుకొచ్చింది. కరీంనగర్ సీపీ గౌస్ ఆలంపై కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. విధుల్లో నిబద్ధతతో పనిచేస్తున్న అధికారిపై వ్యక్తిగత దాడి చేశారని అసోసియేషన్ మండిపడింది. మత మార్పిడుల ఆరోపణలకు ఎలాంటి ఆధారాలూ లేవని తెలంగాణ ఐపీఎస్ అధికారుల అసోసియేషన్ స్పష్టం చేసింది. ఈ ఘటన సివిల్ సర్వీస్ అధికారుల మనోబలాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని తెలిపింది. ఎమ్మెల్యే ప్రవర్తనపై తక్షణ విచారణకు డిమాండ్ చేసింది. ఎమ్మెల్యే నుంచి బహిరంగ క్షమాపణ కోరింది. ప్రస్తుతం పనిచేస్తున్న అధికారి మతమార్పిడికి ప్రయత్నిస్తున్నారని తప్పుడు ఆరోపణలు చేస్తూ.. అతని మతం గురించి చేసిన ఆరోపణలతో తీవ్రంగా కలత చెందుతున్నామని పేర్కొంది. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ క్రమంలో కౌశిక్ రెడ్డి క్షమాపణలు తెలిపారు.

# హోరెత్తిన మేడారం

గద్దెలపై కొలువుదీరిన సమ్మక్క-సారలమ్మ

## శివ సత్తుల పూరణలతో హోరెత్తిన జంపన్నవాగు

## మొక్కులు చెల్లించుకున్న రాష్ట్ర గవర్నర్, మంత్రులు, హైడ్రా కమిషనర్ రంగనాథ్

## నిలువెత్తు బంగారం సమర్పించుకున్న బ్రిటీష్ హైకమిషనర్



**ఉమ్మడివరంగల్ :** సమ్మవ్వ తల్లీ సల్లంగా చూడు.. సారలమ్మ తల్లీ మమ్ములను కరుణించమ్మా.. నిన్నే నమ్ముకొని వచ్చాము.. మా కోర్కెలను తీర్చ మ్మా.. అంటూ భక్తులు ఆదిపరాశక్తి సమ్మక్క-కోర్కెలు తీర్చే కొంగు బంగారం సారలమ్మలను వేడుకున్నారు. ప్రపంచం లోనే అతి పెద్ద ఆదివాసీ గిరిజన జాతరైన మేడారం సమ్మక్క -సారలమ్మ మహాజాతరకు తెలుగు రాష్ట్రాలతోపాటు చత్తీస్గగ ఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశాతోపాటు దేశం నలుమూ లల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివచ్చారు. తల్లీబిడ్డలు సమ్మక్క-సారలమ్మలు గద్దెలపై కొలువుదీరడంతో తల్లులను దర్శించుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. కుటుంబ సమే తంగా తరలివచ్చిన భక్తజనం ముందుగా జంపన్న వాగులో పుణ్యస్నానాలు చేసి తలనీలాలు సమర్పంచుకున్నారు. అనం తరం సమ్మక్క-సారలమ్మను దర్శించుకొని తమ నిలువెత్తు బంగారాన్ని (బెల్లం) అమ్మవార్లకు చెల్లించుకున్నారు. కోళ్లు, మేకలు, గొర్రెలను తల్లులకు బలిచ్చారు. ఒకవైపు తల్లులకు భక్తులు మొక్కులు చెల్లించుకుంటుండగా.. మరోవైపు శివస త్తులు పూనకాలతో ఊగిపోయారు. లక్ష్మిదేవరలు, గట్టమ్మలు తమ పెద్దమ్మతల్లిని కనులారా చూసి, మనసారా మొక్కి దీవిం చమ్మ అంటూ తల్లుల దీవెనలను అందుకున్నారు. మహాజా తరకు బుధ, గురువారాలకన్నా శుక్రవారం పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో మేడారం రోడ్లన్నీ కిటకిటలాడాయి.

### శివసత్తుల పూనకాలతో హోరెత్తిన జంపన్నవాగు

మొక్కులు చెల్లించుకునే భక్తులు జంపన్నవాగులో పవిత్ర పుణ్యస్నానాలు చేశారు. శివసత్తులు జంపన్నవాగులో పూనకా లతో శివాలెత్తారు. సంపెంగ వాగుల్లో అబ్బియా.. జంపన్న వాగులో అబ్బియా.. మా తల్లీ సమ్మ వ్వా.. మా తల్లి సారవ్వా... పూనకాలతో హోరెత్తించారు. శివసత్తులు పూనకాలు ఊగు తుండగా భక్తులు వారి చుట్టూ చేరి తమతమ సమస్యలను తల్లు లకు చెప్పుకుంటూ పరిష్కారం చెప్పాలి తల్లీ అంటూ వేడుకు న్నారు. ఒకవైపు భక్తుల పుణ్య స్నానాలు చేస్తుండగా.. మరోవైపు శివసత్తుల పూనకాలతో జంపన్నవాగు భక్తులతో హోరెత్తింది.

### గద్దెల ప్రాంగణం విస్తరణతో సులుభంగా దర్శనాలు

మేడారంలోని తల్లులు గద్దెల ప్రాంగణాన్ని విస్తరణ చేయడంతో తల్లుల దర్శనాలు ఈసారి చాలా సులభంగా జరుగుతున్నాయి. గతంలో ఈ ప్రాంతం ఇరుకుగా ఉంది. 2,500 మంది భక్తులు మాత్రమే తల్లులను దర్శించుకునే వీలుం డేది. అయితే, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవతో గద్దెల ప్రాంగణాన్ని విస్తరింప చేయడంతో ఒక సారి 9వేల మంది భక్తులు తల్లులను దర్శిం చుకునేందుకు వీలు చిక్కింది. గద్దెల ప్రాంగణం చుట్టూ 8 ద్వారాలను ఏర్పాటు చేయడం తో గద్దెల ప్రాంగణంలోకి వెళ్లిన భక్తులు త్వర త్వరగా తల్లులను దర్శించుకొని బయటకు వస్తున్నారు. ఏఐపీలు దర్శనానికి వచ్చిన సమయాల్లో సాధారణ భక్తులకు దర్శనా లను నిలిపి వేయడంతో కొంత ఇబ్బందికర పరిస్థితులు చూడాల్సి వచ్చింది.

### జాతరకు పెరిగిన వీఐపీల తాకిడి

అమ్మల దర్శనానికి వీఐపీలు, వీవీ ఐపీల తాకిడి పెరిగింది. శుక్రవారం ఉద యం నుంచే వీఐపీల రాక మొదలైంది. గురువారం అర్ధరాత్రి, శుక్రవారం మరో సారి మంత్రి కొండా సురేఖ తల్లుల దర్శనం చేసుకున్నారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు సమ్మక్క సారలమ్మను దర్శించుకున్నారు. నిలువెత్తుబంగారాన్ని తల్లులకు గవర్నర్ సమర్పించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ కూడా తల్లు లను దర్శించుకొని నిలువెత్తు బంగా రాన్ని సమర్పించుకున్నారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ సైతం తల్లుల్ని దర్శించుకున్నారు. బ్రిటీష్ హై కమిషనర్ గ్యారత్ వెన్ ఓవెన్ తొలిసారి గా వచ్చి తల్లులను దర్శించుకొని నిలు వెత్తు బంగారం సమర్పించుకున్నారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్ దంపతు లు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంక టేశ్వర్లు దంపతులు, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు దంపతులు కూడా అమ్మవార్లను దర్శించుకుని నిలువెత్తు బంగారాన్ని తల్లులకు మొక్కుగా సమర్పించుకు న్నారు. రాష్ట్ర డీజీపీ శివధర్రెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి దంపతులు, మహ బూబాబాద్ ఎంపీ పోరిక బల రాం నాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ ఎంఎల్సీ కల్వకుంట్ల కవిత, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దేవసేనా, పొలిటికల్ ఎకనామిక్ అడ్వైజర్ నళిని రఘురామ్, జైళ్లశాఖ డీఐజీ సౌమ్యా మిశ్ర తదితరులు తల్లులను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

### చివరి అంకానికి మహాజాతర.. నేడు తల్లుల వనప్రవేశం

మేడారం మహాజాతర చివరి అంకానికి చేరుకుంది. కన్నె పల్లి నుంచి సారలమ్మ. పూనుగండ్ల నుంచి పగిడిద్దరాజు, కొం డాయినుంచి గోవిందరాజు, సమ్మక్క గద్దెలపై కొలువు దీర డంతో ప్రారంభమైన మహాజాతర ప్రధాన ఘట్టానికి చేరుకుం ది. శనివారం సాయంత్రం 4 గంటల వేళ తల్లుల వన ప్రవేశం తో మహాజాతర ముగియనున్నది. సమ్మక్కను తిరిగి చిలుకల గుట్టకు, సారలమ్మను కన్నెపల్లికి, పగిడి ద్దరాజును పూను గండ్లకు, గోవిందరాజులను కొండాయికి ఆదివాసీ సంప్ర దాయాలతో సాగనంపుతారు. తల్లుల వన ప్రవేశంతో మహాజాతర ముగుస్తుంది.

# గుట్ట ప్రచార శాఖ 'డాలర్ల' మాయంలో ఇద్దరి సస్పెన్షన్

## ముగ్గురికి షోకాజ్

## పర్యవేక్షకులకు చార్జ్ మెమోలు.. ఏఈఓకు కూడా షోకాజ్ నోటీసు

## రాత్రి పొద్దు పోయాక ఈఓ భవానీ శంకర్ ఆదేశాలు జారీ



యాదాద్రి, (రోమింగ్ న్యూస్ బ్యూరో):
దేవస్థానం ప్రచార శాఖలో భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న 'డాలర్ల' అదృశ్యం ఘటనపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు చేపట్టారు. గత నెల 29న ప్రచార శాఖలో డాలర్లు మాయమైనట్లు వచ్చిన పత్రికా కథనాలపై తీవ్రంగా స్పందించిన కార్యనిర్వాహణాధికారి (ఈఓ), వాస్తవాలను నిగ్గుతేల్చేందుకు ఉన్నత స్థాయి విచారణ కమిటీని ఆదేశించారు. ఈ మేరకు విచారణ కమిటీ సమర్పించిన సమగ్ర నివేదికను పరిగణనలోకి తీసుకున్న ఈఓ, విధుల్లో తీవ్ర నిర్లక్ష్యం వహించినట్లు తేలిన ఐదుగురు సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటూ ఉత్తర్వులు జారీ చేశారు.

### నిర్లక్ష్యం వహిస్తే వేటే..

ప్రచార శాఖలో కీలక విభాగంలో విధులు నిర్వహిస్తూ, స్టాక్ నిర్వహణలో ఘోరంగా విఫలమైనందుకు గాను జూనియర్ అసిస్టెంట్ పి. రామచంద్ర శేఖర్, రికార్డ్ అసిస్టెంట్ టి. లక్ష్మిని తక్షణమే విధుల్లో నుండి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. దైవ కార్యంలో అంకితభావంతో పనిచేయాల్సిన చోట బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడాన్ని యాజమాన్యం తీవ్రంగా పరిగణించింది.

### పర్యవేక్షణ లోపంపై సీరియస్:

క్రింది స్థాయి సిబ్బంది కార్యకలాపాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయడంలో మరియు అక్రమాలను నిరోధిం చడంలో విఫలమైనందుకు గాను పర్యవేక్షకులు కె. నటరా జు, కె. సీతారామాచార్యులపై కూడా చర్యలు ప్రారంభమ య్యాయి. వీరికి శాఖాపరమైన చార్జ్ మెమోలు జారీ చేస్తూ, జరిగిన లోపాలకు సంబంధించి వివరణ కోరారు. అలాగే, ఈ వ్యవహారం మొత్తం ఎవరి పర్యవేక్షణలో జరిగిందో, ఆ విభాగానికి బాధ్యత వహిస్తున్న సంబంధిత సహాయ కార్యనిర్వాహణాధికారి (ఏఈఓ) కి షోకాజ్ నోటీసు జారీ చేయడం దేవస్థాన వర్గాల్లో చర్చనీయాంశమైంది.

### నివేదిక ఆధారంగానే చర్యలు:

విచారణ కమిటీ డాలర్ల నిల్వలు, రిజిస్టర్లు మరియు సిబ్బంది మధ్య సమన్వయ లోపాన్ని ప్రధానంగా ఎత్తిచూపినట్లు తెలుస్తోంది. దేవస్థానం ప్రతిష్టకు భంగం కలిగించే ఇలాంటి ఘటనలను ఉపేక్షించే ప్రసక్తే లేదని, బాధ్యులెవరైనా కఠిన చర్యలు తప్పవని ఈ ఉత్తర్వుల ద్వారా పాలకమండలి మరియు ఉన్నతాధికారులు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. ఈ ఘటనపై తదుపరి విచారణ కొనసాగుతోంది.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శనివారం 31 జనవరి 2026





# నేత్రపర్వంగా నారసింహుడి 'ఎదుర్కోలు' మహోత్సవం

**ఉదయం సింహవాహనం, రాత్రి అశ్వవాహనంపై స్వామివారి ఊరేగింపు**

**నేడు రాత్రి 7:30 గంటలకు స్వామివారి తిరుకల్యాణం**



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట ఆలయానికి అనుబంధ క్షేత్రమైన పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా మూడో రోజు ముఖ్య ఘట్టమైన ఎదుర్కోలు మహోత్సవాన్ని శుక్రవారం ఆలయ ప్రధానార్చకులు కాండూరి వెంకటాచార్యులు, సురేంద్రాచార్యుల అర్చకత్వంలో అర్చక బృందం నయనానందకరంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో నిత్య ఆరాధనలు ముగిసిన అనంతరం స్వామి అమ్మవార్లను రకరకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి అశ్వవాహనంపై ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయంలోని కల్యాణ మండపంలో ఎదుర్కోలు మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామిఅమ్మవార్లను ఎదురెదురుగా అధిష్టింపజేసి ఎదుర్కోలు తంతును చేపట్టారు. రాత్రి 7:30 గంటలకు మొదలైన ఎదుర్కోలు మహోత్సవం రెండు గంటల పాటు కన్నులపండువగా జరిగింది. స్వామివారి తరఫున ఆలయ ఈవో భవానీ శంకర్, అమ్మవారి తరఫున ఆలయ చైర్మన్ నరసింహమూర్తి పెళ్లిపెద్దలుగా ఉండి ఎదుర్కోలు తంతును నిర్వహించారు. ఎదుర్కోలు మహోత్సవంలో భాగంగా ఇరువర్గాల మధ్య వాదసంవాదాల నడుమ ఎదుర్కోలు మహోత్సవం కనుల పండువగా జరిగింది. వేదపండితులు లక్ష్మీనరసింహుడి కల్యాణం కోసం మంచి ముహూర్తాన్ని నిర్ణయించారు. శనివారం రాత్రి 7:30 గంటలను లక్ష్మీనారసింహుల కల్యాణం నిర్వహించాలని సుముహూర్తం నిర్ణయించారు.

**ఉదయం సింహవాహనంపై విహారం**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం భూదేవీ సమేతుడైన నారసింహుడిని అర్చకులు సింహవాహనంపై ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. దుష్టశిక్షణ, శిష్ట రక్షణ కోసం శ్రీమన్నారాయణుడు నరసింహ రూపంలో సింహాన్ని వాహనంగా చేసుకుని భక్తులకు దర్శనమిచ్చే తంతును అర్చకులు భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో భవానీ శంకర్, చైర్మన్ నరసింహమూర్తి, డిప్యూటీ ఈవో భాస్కర్ శర్మ, ఏఈవో మహేష్, సూపరింటెండెంట్ సురేందర్ రెడ్డి, ఆలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

**ఇయ్యాల తిరుకల్యాణ మహోత్సవం**

బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి 7:30 గంటలకు లక్ష్మీనరసింహుల తిరుకల్యాణ మహోత్సవం జరగనుంది.

ఉదయం హనుమంత వాహనం, సాయంత్రం గజవాహనంపై ఆలయ పురవీధులలో స్వామివారిని ఊరేగించిన అనంతరం.. రాత్రి 7:30 గంటల నుండి స్వామివారి తిరుకల్యాణ మహోత్సవాన్ని చేపట్టనున్నారు. ఇందుకోసం ఆలయం వెలుపల కల్యాణ మండపాన్ని సిద్ధం చేశారు. భక్తుల సౌకర్యార్థం ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేస్తున్నారు. కల్యాణంలో పాల్గొనే భక్తుల కోసం కల్యాణ టికెట్లను అందుబాటులో ఉంచారు. ఒక్కో టికెట్ ధర రూ.600 గా నిర్ణయించారు.

# యాదగిరిగుట్ట మున్సిపాలిటీని కాంగ్రెస్ క్లీన్ స్వీప్ చేయబోతుంది

**మున్సిపల్ ఎన్నికల కోసం బీఆర్ఎస్, బీజేపీ చీకటి ఒప్పందం**

**ప్రభుత్వ విప్, డీసీసీ చీఫ్ బీర్ల అయిలయ్య**



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: ఫిబ్రవరి 11న జరిగే మున్సిపల్ ఎన్నికల్లో యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో(12 వార్డులు) కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచి క్లీన్ స్వీప్ చేయబోతున్నామని ప్రభుత్వ విప్, డీసీసీ చీఫ్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య స్పష్టం చేశారు. శుక్రవారం యాదగిరిగుట్టలో కాంగ్రెస్ పార్టీ వార్డు అభ్యర్థులతో కలిసి నిర్వహించిన నామినేషన్ ర్యాలీలో స్టేట్ విమెన్స్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్ పర్సన్ బండ్రు శోభారాణితో కలిసి ఆయన పాల్గొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 12 వార్డుల్లో కాలినడకన తిరిగి కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాదగిరిగుట్ట మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ కలిసి పోటీ చేస్తున్నామని, పొత్తులో భాగంగా కాంగ్రెస్ 11 వార్డుల్లో, సీపీఐ ఒక వార్డులో పోటీ చేస్తున్నామని ప్రకటించారు. యాదగిరిగుట్ట మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయడానికి ప్రతిపక్ష పార్టీలకు అభ్యర్థులే కరువయ్యారని, అందుకోసమే బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు చీకటి ఒప్పందం చేసుకున్నాయని చెప్పారు. ఒప్పందంలో భాగంగానే బీఆర్ఎస్ పోటీలో ఉన్న వార్డుల్లో బీజేపీ.. బీజేపీ పోటీ చేస్తున్న వార్డుల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను పెట్టలేదన్నారు. కొన్ని వార్డుల్లో కాంగ్రెస్ ఓట్లను చీల్చడం కోసం బీఆర్ఎస్, బీజేపీ రెండు పార్టీలు కలిసి డమ్మీ అభ్యర్థులను పోటీలో పెట్టాయని ఎద్దేవా చేశారు.

**బీఆర్ఎస్ దొడ్డి దారిలో చైర్మన్ పీఠాన్ని దక్కించుకుని అభివృద్ధిని మరిచారు**

యాదగిరిగుట్టలో 2019లో మున్సిపాలిటీకి జరిగిన ఎన్నికల్లో సరిపడా కౌన్సిలర్ సీట్లు గెలవకున్నా అధికార బలంతో చైర్మన్ పీఠాన్ని దక్కించుకున్న బీఆర్ఎస్.. మున్సిపాలిటీ అభివృద్ధిని మాత్రం గాలికొదిలేసిందని మండిపడ్డారు. చైర్మన్ పీఠాన్ని దక్కించుకోవడం కోసం బీఆర్ఎస్ చూపిన శ్రద్ధ యాదగిరిగుట్ట మున్సిపాలిటీని అభివృద్ధి చేయడంలో మాత్రం చూపించలేదన్నారు. పైగా బీఆర్ఎస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల కారణంగా యాదగిరిగుట్ట పట్టణం అభివృద్ధికి దూరమై ఆగమైందన్నారు. ఆలయ అభివృద్ధి పేరుతో స్థానిక చిరువ్యాపారులు, ఆటో డ్రైవర్ల ఉపాధిని కేసీఆర్ కొల్లగొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరిగి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాకే యాదగిరిగుట్టలో తిరిగి అభివృద్ధి మొదలైందని, ఆటోలను కొండపైకి అనుమతించి ఆటో కార్మికుల కుటుంబాలకు అండగా నిలిచామని పేర్కొన్నారు. తాగునీటి సమస్యను శాశ్వతంగా పారద్రోలడం కోసం మూడు భారీ ఓవర్ హెడ్ ట్యాంకులు, వాహనదారుల కష్టాలను తీర్చడం కోసం పట్టణంలో బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, శానిటేషన్ పై స్పెషల్ ఫోకస్ పెట్టి అండర్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే అభివృద్ధి చేయడం మరింత సులభం అవుతుందన్న ఆయన.. ఫిబ్రవరి 11న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు బిక్షపతి, యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్ పర్సన్ అభ్యర్థి గుండ్లపల్లి వాణీ భరత్ గౌడ్, వైస్ చైర్మన్ అభ్యర్థి ముక్కెర్ల మల్లేష్ యాదవ్, వార్డు అభ్యర్థులు అరుణ, మధు, రమ్య, స్వప్న ఆంజనేయులు, సరోజ హరీష్, ప్రియదర్శిని, లావణ్య, వెంకటేష్ యాదవ్, ధనలక్ష్మీ మధుకర్, శ్రీధర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

# యాదగిరిగుట్ట మున్సిపాలిటీకి 77 నామినేషన్లు

**అత్యధికంగా బీఆర్ఎస్ 25, కాంగ్రెస్ 23 నామినేషన్లు దాఖలు**

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట మున్సిపాలిటీకి జరిగే ఎన్నికల కోసం మూడు రోజుల్లో కలిపి మొత్తం 77 నామినేషన్లు దాఖలయ్యాయి. మొత్తం 12 వార్డులకు గానూ మూడో రోజుల్లో కలిపి 77 నామినేషన్లు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. మూడు రోజుల్లో కలిపి వార్డుల వారీగా చూస్తే.. ఒకటో వార్డుకు 7, రెండో వార్డుకు 9, మూడో వార్డుకు 7, నాలుగో వార్డుకు 6, ఐదో వార్డుకు 8, ఆరో వార్డుకు 4, ఏడో వార్డుకు 5, ఎనిమిదో వార్డుకు 8, తొమ్మిదో వార్డుకు 6, పదో వార్డుకు 5, పదకొండో వార్డుకు 4, పన్నెండో వార్డుకు 8 నామినేషన్లు వచ్చాయి. పార్టీల వారీగా చూస్తే.. అత్యధికంగా బీఆర్ఎస్ 25, కాంగ్రెస్ 23, బీజేపీ 14, జనసేన 3, సీపీఐ 2, బీఎస్పీ 1, స్వతంత్రులు 9 నామినేషన్లు వేశారు. కాగా 31న స్క్రూటినీ నిర్వహించి వాలిడ్ అయిన అభ్యర్థుల వివరాలు వెల్లడించనున్నారు. ఫిబ్రవరి 1న అప్పీల్ కు అవకాశం కల్పించనున్నారు. ఫిబ్రవరి 3న మధ్యాహ్నం 3 గంటలలోపు నామినేషన్ ఉపసంహరణకు అవకాశం ఇచ్చి అదే రోజు సాయంత్రం లోపు పోటీలో నిలిచిన అభ్యర్థుల వివరాలతో పాటు ఇండిపెండెంట్ అభ్యర్థులకు గుర్తులు కేటాయించనున్నారు. ఫిబ్రవరి 11న ఎన్నికలు నిర్వహించి 13న కౌంటింగ్ చేపట్టి ఫలితాలు వెల్లడించనున్నారు.

# పుర సమస్యలపై పోరాడుతున్న బీజేపీని గెలిపించండి

**హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి విజయలక్ష్మీ**



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట మున్సిపా లిటీ ప్రజల సమస్యలపై, శ్రీలక్ష్మీనర సింహ స్వామి దేవస్థానంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై నిరంతరం పోరాడుతున్న బీజేపీ బలపరిచిన అభ్యర్థులను మున్సిపల్ ఎన్నికల్లో ఆశీర్వదిం చాలని భారతీయ జనతా పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి బండారు విజయలక్ష్మీ కోరారు. యాదగిరిగుట్టలో బీజేపీ అభ్యర్థుల నామినేషన్ల దాఖలు సందర్భంగా.. శుక్రవారం పట్టణంలో బీజేపీ శ్రేణులు నిర్వహించిన ర్యాలీలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత రెండేళ్ల నుండి యాదగిరిగుట్టలో ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తెచ్చి పరిష్కరించడంలో బీజేపీ యువత కృషి అమోఘమన్నారు. అలాగే యాదగిరిగుట్ట దేవస్థానంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను వెలికితీస్తూ ఆలయ పవిత్రతను కాపాడడం కోసం బీజేపీ నాయకులు నిరంతర కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. బీజేపీ యువ నాయకత్వం వల్లే ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో యాదగిరిగుట్ట పట్టణంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కంటే బీజేపీకి అధిక ఓట్లు వేసి ఆదరించారని, మున్సిపల్ ఎన్నికల్లో కూడా అదేవిధమైన మద్దతు ఇవ్వాలని పుర ప్రజలను కోరారు. ఎలాంటి పదవులు లేకున్నా ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్న బీజేపీ అభ్యర్థులను కౌన్సిలర్లుగా గెలిపిస్తే.. మరింత బాధ్యతతో ప్రజల తరఫున పని చేస్తారని చెప్పారు. ఫిబ్రవరి 11న జరిగే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అశోక్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కాదూరి అచ్చయ్య, పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ రచ్చ శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు శ్యాంసుందర్, మండల మాజీ అధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా కౌన్సిల్ మెంబర్ చంద్రమౌళి, మున్సిపల్ ఎన్నికల బీజేపీ అభ్యర్థులు రాధ, శ్రీకాంత్, శివ, సాయి లత, కర్రె మాధవి, రంగ సత్యం, రాజమణి, శ్రీనివాస్, కృష్ణ, బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు.

# ఎములాడ రాజన్న జాతర పోస్టర్లను ఆవిష్కరించిన ఇంచార్జి కలెక్టర్

**ఫిబ్రవరి 14 నుంచి ఎములాడలో రాజన్న జాతర**



రోమింగ్ న్యూస్, వేములవాడ: రాజన్న సిరిసిల్ల, జనవరి -30: వచ్చే నెల ఫిబ్రవరి 14వ తేదీ నుంచి నిర్వహించనున్న మహా శివరాత్రి జాతర పోస్టర్లను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆవిష్కరించారు. వచ్చే నెల ఫిబ్రవరి 14వ తేదీ నుంచి వేములవాడలో నిర్వహించనున్న మహా శివరాత్రి జాతర పోస్టర్లను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆలయ ఈఓ రమాదేవి, అధికారులు, అర్చకులతో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఆలయ ఈఓ, అర్చకులు ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ కు జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. వచ్చే నెల ఫిబ్రవరి 14వ తేదీ నుంచి 16 వ తేదీ వరకు వేములవాడలో మహా శివరాత్రి జాతర ఉత్సవాలు నిర్వహించనున్నామని వెల్లడించారు. 15 వ తేదీన మహా శివరాత్రి జాతర నిర్వహించనున్నామని తెలిపారు. జాతర సందర్భంగా భక్తులకు కల్పిస్తున్న ఏర్పాట్లపై అధికారులను ఇంచార్జి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రణాళిక ప్రకారం అన్ని వసతులు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఈ రాజేష్, డీఈ రఘునందన్, అర్చకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సిపిఎం అభ్యర్థి యాదగిరిని గెలిపించండి

**సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ పిలుపు**



పోచంపల్లి, రోమింగ్ న్యూస్: కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ అభ్యర్థులను ఓడించి 4వ వార్డులో పోటీ చేస్తున్నా సిపిఎం అభ్యర్థి వడ్డేపల్లి యాదగిరిని గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా పిలుపునిచ్చారు. శుక్రవారం పోచంపల్లి మున్సిపాలిటీలోని 4 వార్డు నుండి పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్థి యాదగిరి వార్డులో భారీ ప్రదర్శన నిర్వహించి నామినేషన్ వేసి అనంతరం జరిగిన సభలో నర్సింహ పాల్గొని మాట్లాడుతూ కష్టజీవులు, కార్మికులు, పేదలు, రైతులు సబ్బండ వర్గాలు బలపరిచిన సిపిఎం పార్టీ అభ్యర్థి యాదగిరిని అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. యాదగిరి సిపిఎం ఆధ్వర్యంలో పట్టణంలో ఉన్న తాగునీటి కోసం, మురికి కాల్వల కోసం, వీధిలైట్ల కోసం, అందరికీ ఇండ్లు, ఇళ్ల స్థలాలు కావాలని జరిగిన ఉద్యమాల్లో ముందుండి పని చేశారని తెలిపారు. మూసీ నీరుకు ప్రత్యామ్నాయంగా కృష్ణ, గోదావరి జలాలను అందించాలని జరిగిన ఉద్యమాల్లో కూడా ముందుండి పని చేశారని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర కావాలని, ఉపాధి కూలీలకు మున్సిపల్ పట్టణంలో పనులు కల్పించాలని జరిగిన అనేక పోరాటాలు కూడా యాదగిరి నిర్వహించారని తెలిపారు. పోచంపల్లి మున్సిపల్ పట్టణం, 4వ వార్డు సమగ్రాభివృద్ధి కావాలంటే సిపిఎం అభ్యర్థి వడ్డేపల్లి యాదగిరినే గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో 4వ వార్డు అభ్యర్థి వడ్డేపల్లి యాదగిరి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోట రామచంద్రారెడ్డి, పట్టణ కార్యదర్శి దుబ్బాక జగన్, మాజీ జిల్లా కమిటీ సభ్యులు పగిళ్ల లింగారెడ్డి, మండల పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు మంచాల మధు, ప్రసాదం విష్ణు, గూడూరు బుచ్చిరెడ్డి, పట్టణ, మండల కమిటీ సభ్యులు గూడూరు రాంరెడ్డి, బుగ్గ లక్ష్మయ్య, పొన్నమోని కృష్ణ, పత్తి బిక్షపతి, నోముల కృష్ణారెడ్డి, నెల్లకంటి జంగయ్య, సామ జంగారెడ్డి తోపాటు కళ్లెం ముత్యంరెడ్డి, నల్ల బాలయ్య, గుర్రు బాలయ్య, పోతగల రామచంద్రం, పెద్దల యాదయ్య, నాగమ్మ, మంగమ్మ, లక్ష్మి, సంపూర్ణ, లక్ష్మమ్మ, అనసూయ, ఈరమ్మ పాల్గొన్నారు.

# విపంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురుకులం స్టడీ మెటీరియల్ అందజేత



రామన్నపేట, రోమింగ్ న్యూస్: విశ్రాంత ఉపాధ్యాయులు కీర్తి శేషులు అనుముల అంతయ్య గారి స్మారకార్థం వారి కుమారుడు అనుముల శ్రీనివాస్ విపంచి ఫౌండేషన్ ఆధ్వర్యం లో వెల్లంకి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల లో నాలుగవ తరగతి చదువుతున్న 18 మంది విద్యార్థులకు గురుకులం ఉచిత స్టడీ మెటీరియల్ ను ఫౌండేషన్ ప్రోగ్రాం కో - ఆర్డినేటర్ నకరేకంటి సతీష్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ గత సంవత్సరం కూడా వెల్లంకి ప్రాథమిక పాఠశాల లో ఉచిత స్టడీ మెటీరియల్ వినియోగించుకొని పదమూడు మంది విద్యార్థులు సీట్లు పొందారు అలాగే ఈ సంవత్సరం కూడా అందరూ సీట్లు పొందాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రతిభగల పేద విద్యార్థులు ఇట్టి మెటీరియల్ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన్ రెడ్డి మాట్లాడుతూ మారుమూల ప్రాంతాలలో విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్న విపంచి ఫౌండేషన్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నామన్నారు , ఇంకా ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సోమిరెడ్డి , వెంకటేశం ,సువర్ణ,మాధవి విద్యాకమిటీ ఛైర్మన్ సులోచన,మాజీ ఏం పి టి సి ఎర్రోల్ల సుక్కమ్మ తెలంగాణ ఉద్యమకారులు డాక్టర్ ఎన్ అశోక్ కుమార్, ఎర్రోళ్ల మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శనివారం 31 జనవరి 2026



# తెలంగాణ ప్రాజెక్టులకు పాతర

**చంద్రబాబుతో దోస్తీతో ఏపీకి లైన్ క్లియర్**
**నల్లమల సాగర్ ప్రాజెక్ట్ కోసం నాటకాలుడుతన్న రేవంత్**
**ఇరిగేషన్ మీటింగ్ బాయ్‌కాట్ చేయడం ఒక్కటే మేలు**
**రేవంత్‌ను ప్రజాక్షేత్రంలో ఎండగడతామన్న హరీష్ రావు**



**హైదరాబాద్,జనవరి 30 :** ఏపీ సీఎం చంద్రబాబుతో సీఎం రేవంత్‌రెడ్డి దోస్తీ కట్టి తెలంగాణకు అన్యాయం చేస్తున్నదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్‌రావు విమర్శించారు. చంద్రబాబుతో దోస్తీ కోసం రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న రేవంత్‌రెడ్డిని తెలంగాణ సమాజం క్షమించదని అన్నారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ప్రెస్‌మీట్ పెట్టి హరీష్‌రావు మాట్లాడారు. కేసీఆర్ హయాంలో కేంద్రానికి 10 డీపీఆర్‌లు పంపి ఏడు ప్రాజెక్టులకు అనుమతులు తెచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ రెండేళ్లలో కాంగ్రెస్ ఒక్క అనుమతి కూడా తేలేదని ఎద్దేవా చేశారు. 'ఢిల్లీ మీటింగ్‌కు వెళ్లేందుకు ఆదిత్యనాథ్ మినహా తెలంగాణ సోయి కలిగిన ఒక్క ఇంజినీర్ దొరకలేదా..?' అని హరీష్‌రావు ప్రశ్నించారు. మన తెలంగాణ నీళ్లను ఏపీకి తీసుకువెళ్లే కుట్ర ఇది. తెలంగాణ సోయి ఉన్న ఒక్క ఇంజినీర్ దొరకలేదా..? దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్నట్లు చేస్తున్నారు. పోనుపోను అంటూనే మీటింగ్‌లకు అటెండ్ కావడం ఏమిటి..? తెలంగాణ నీటి హక్కులను గంపగుత్తగా ఏపీకి అప్పజెప్పడమే మీ చర్చల లక్ష్యమా..?' అని ప్రశ్నించారు. సమైక్య పాలనలో మనకు నీటి వాటాల్లో తీరని అన్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీ.. నేడు మరో చారిత్రక ద్రోహం చేస్తున్నదని మాజీ మంత్రి హరీష్‌రావు విమర్శించారు. ఇవాళ్టి ఇరిగేషన్ మీటింగ్ ద్వారా రాష్ట్ర కాంగ్రెస్ సర్కారు తెలంగాణకు మరణశాసనం రాయబోతున్నదని చెప్పారు. పోలవరం నల్లమలసాగర్ విషయంలో రేవంత్ ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం ఏపీకి సహకరిస్తున్నది. ఆ కుట్రల తీరును ఒకసారి గమనించండి. పోను పోను అనుకుంటూన్నే ÷శివంత్ రెడ్డి నాడు డిల్లీ మీటింగ్‌కు వెళ్ళాడు. ఎజెండాలో లేదంటూనే బనకచర్లపై చర్చ జరిపాడు. పెట్టబోను అంటూనే సంతకంపెట్టి తెలంగాణ నదీ జలాల హక్కులను కాలరాశాడు. వేయను అంటూనే కమిటీవేసి ఏపీ జలదోపిడీకి రెడ్ కార్పెట్ వేశాడు. టెండర్ చివరి తేదీ అయిపోయాక సుప్రీంకోర్టుకు వెళ్ళి నల్లమలసాగర్ ప్రాజెక్టుకు పరోక్షంగా అంగీకారం తెలిపాడు. పసలేని రిట్ వేసి పరిపూర్ణంగా నల్లమలసాగర్‌కు మద్దతు ప్రకటించాడు' అని రేవంత్ కుట్రలను వెల్లడించాడు.

చంద్రబాబుకు రేవంత్ గురుదక్షిణ చెల్లిస్తున్నడు. ఏపీ ఒత్తిడితో ఇవాళ జరుగుతున్న ఢిల్లీ మీటింగ్‌లో ఇంజినీర్లు పాల్గొంటున్నారు. ఇది పేరుకు జలవివాదాల మీటింగ్ కానీ, మన 200 టీఎంసీల నీటిని గంపగుత్తగా తరలించుకుపోయే నల్లమలసాగర్ అనే ప్రాజెక్టుకు సంబంధించిన కుట్ర. ఇలాగే గతంలో కేంద్ర జలశక్తి శాఖ నిర్వహించిన సమావేశంలో ఏపీ ఈ ప్రాజెక్టునే ఏకైక ఎజెండాగా ముందుపెట్టింది. ఇప్పుడు కూడా ఏపీ పాలకులు నల్లమలసాగర్ లింకు ప్రాజెక్టునే తెరమీదకు తెచ్చి చర్చ చేస్తున్నరు' అని హరీష్‌రావు విమర్శించారు. కేసీఆర్ హయాంలో గోదావరిలో 400 టీఎంసీలకు కేంద్రం నుంచి అనుమతులు తెచ్చారు. గోదావరి మీద 10 డీపీఆర్‌లు పంపి.. 7 ప్రాజెక్టులకు అనుమతులు సాధించారు. రెండేళ్లలో ఒక్క డీపీఆర్ పంపింది లేదు. ఒక్క అనుమతి తెచ్చింది లేదు. వార్ధా, కాళేశ్వరం మూడు టీఎంసీలకు సగం అనుమతులు వస్తే, పూర్తి చేయకుండా డీపీఆర్‌లు వాపస్ చేసింది. రేవంత్‌రెడ్డి పాలనలో డీపీఆర్‌లు వాపస్ వచ్చిన పరిస్థితి. నువు మన డీపీఆర్‌లు వాపస్ తెచ్చుకుంటవు, నల్లమలసాగర్‌కు జెండా ఊపుతవు. అలాంటి చంద్రబాబుతో దోస్తీ కట్టి, తెలంగాణకు తీరని అన్యాయం చేసేందుకు సిద్ధమైన రేవంత్ రెడ్డీ నిన్ను

తెలంగాణ సమాజం క్షమించదు' అని హరీష్‌రావు వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ నీటిని ఒడిసిపట్టిండ్రని, ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి విడిచిపెట్టిండని హరీష్‌రావు మండిపడ్డారు. ఏపీ పాలకులతో కలిసి తెలంగాణకు జలద్రోహం చేస్తున్నడని విమర్శించారు. రేవంత్‌రెడ్డి దుర్మార్గాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగడుతామని హెచ్చరించారు. కేసీఆర్ పాలన గురించి ఎకనామిక్ సర్వే రిపోర్టే స్పష్టం చేసింది. తెలంగాణ అద్భుతమైన ప్రగతి సాధించింది. రెండు కోట్ల 20 లక్షల ఎకరాలు మాగాణిగా మారింది. కాళేశ్వరం, మిషన్ కాకతీయ ద్వారా అద్భుతమైన ఆయకట్టు వచ్చింది. కాళేశ్వరం ద్వారా 17 లక్షల 823 ఎకరాల స్థిరీకరణ, మిషన్ కాకతీయ ద్వారా పదిహేను లక్షల ఎకరాల ఆయకట్టు సాధ్యమైంది. 32 లక్షల ఎకరాల ఆయకట్టు బీఆర్ఎస్ సాధించింది' అని మాజీ మంత్రి చెప్పారు. 'బీజేపీ నేతలు బండి సంజయ్, కిషన్ రెడ్డి ఇప్పటికైనా నోరు పారేసుకోవడం మానుకుంటే మంచిది. కేంద్రంలోని మీ ప్రభుత్వమే తెలంగాణ ప్రగతిపథాన్ని వివరించింది. కళ్లు తెరవండి అనవసరంగా బీఆర్ఎస్ మీద నోళ్లు పారేసుకోకండి' అని హరీష్‌రావు బీజేపీ నేతలకు హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఢిల్లీ మీటింగ్‌ను బాయ్‌కాట్ చేయాలని డిమాండ్ చేశారు. పాలకులకు ఢిల్లీకి, దావోస్‌కు తిరగడమే తప్ప పాలన మీద దృష్టి లేదని విమర్శించారు. బీఆర్ఎస్ సేద్యంపై దృష్టిసారిస్తే, రేవంత్ చోద్యం చూస్తున్నడని ఆరోపించారు.

# తెలంగాణ నీటి ప్రయోజనాలను వదులుకోం

**పోలవరం-నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టు పై చర్చే లేదు**
**హరీష్ రావు నిజాలు తెలుసుకుని మాట్లాడాలి**
**పదేళ్లలో సాగునీటి రంగాన్ని భ్రష్టు పట్టించిన బిఆర్ఎస్**
**మండిపడ్డ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**




**హైదరాబాద్,జనవరి 30 :** కేంద్ర జలసంఘం ఛైర్మన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పోలవరం-నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టు అంశాన్ని అధికారులు పూర్తిగా వ్యతిరేకించినట్టు తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. నదీ జలాల్లో తెలంగాణ ప్రయోజనాలు పరిరక్షించేలా అవసరమైన వాదనలను అధికారులు వినిపించారని చెప్పారు. పోలవరం - బనకచర్ల లేదా నల్లమలసాగర్‌కు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని శుక్రవారం నాటి సమావేశంలో సీడబ్ల్యూసీ ఛైర్మన్ స్పష్టంగా చెప్పారన్న మంత్రి... గతంలో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ కూడా లిఖితపూర్వకంగా తెలిపారని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో తెలంగాణకు నీటి వాటాల్లో నష్టం జరిగిందని ఆరోపించారు. కృష్ణా, గోదావరి నదీ జలాల్లో తెలంగాణ ప్రభుత్వం చుక్క నీరు కూడా వదులుకోదని.. తెలంగాణ నీటి హక్కుల కోసం సర్వశక్తులు ఒడ్డుతూ పోరాడుతున్నట్లు వివరించారు. నీటి వాటాలపై చర్చలకు తాము సిద్ధమేనని అన్నారు. దిల్లీ సమావేశం గురించి మాజీమంత్రి హరీశ్ రావు తెలుసుకొని మాట్లాడితే బాగుండేదని ఉత్తమ్ సూచించారు. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా కేవలం 60, 70 టీఎంసీలను మాత్రమే వ్యవసాయానికి ఉపయోగించారని.. రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టి లక్ష ఎకరాలకు కూడా నీరు ఇవ్వలేదని విమర్శించారు. నీటిపారుదల రంగాన్ని సర్వనాశనం చేసిన బీఆర్ఎస్ నేతలు తమను విమర్శించడం విడ్డూరంగా ఉ ఒదని ఆక్షేపించారు. ఆదిత్యనాథ్ దాస్ గురించి పదేపదే మాట్లాడడం తగదన్న ఆయన... తెలంగాణ ప్రాజెక్టులపై పూర్తి అవగాహన ఉన్నందుకే ఆదిత్యనాథ్ దాస్‌ను ప్రభుత్వ సలహాదారుగా పెట్టుకున్నట్లు వివరించారు. కేంద్ర జల వివాదాల పరిష్కార కమిటీ సమావేశం దాదాపు రెండు గంటల ఈ భేటీ సాగింది. ఈ అంశంపై తెలంగాణ ఇరిగేషన్ సెక్రటరీ రాహుల్ బొజ్జా మాట్లాడుతూ.. తెలంగాణ నుంచి 12 అంశాలు చర్చించాలని ప్రతిపాదించామన్నారు. పోలవరం నల్లమల్ల సాగర్ ప్రాజెక్టును అజెండాలో పెట్టొద్దని స్పష్టం చేసినట్లు తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య పలు జల వివాదాలు ఉన్నాయి.. కృష్ణా, గోదావరి జలాలపై అనేక అంశాలు ఉన్నాయి, అందుకే సమావేశానికి వచ్చామని వెల్లడించారు. ఈ సమావేశంలో ఏపీ తన అజెండాను చెప్పలేదని.. తదుపరి సమావేశం సీడబ్ల్యూసీ నిర్ణయిస్తుందన్నారు. అనంతరం.. ఈ అంశంపై తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. 'ఒక్క చుక్క నీరు కూడా వదులుకోం. ఢిల్లీలో జరిగిన మీటింగ్ గురించి హరీష్ రావు తెలుసుకుని మాట్లాడాలి.. మన నది జలాలను కాపాడుకోవడానికి ఎవరితోనైనా చర్చలకు సిద్ధం.. కానీ చుక్క నీరు కూడా వదులుకునేది లేదు.. తెలంగాణ అధికారులు.. నల్లమల సాగర్ ప్రాజెక్టును అజెండాలో పెట్టడానికి ఒప్పుకోమని స్పష్టం చేశారు.. ఇంటర్ స్టేట్ ఇష్యూలు అజెండాలో పెట్టాలని కేంద్రానికి చెప్పారు. పోలవరం.. నల్లమల సాగర్ కి అనుమతి లేదని కేంద్ర మంత్రి నాకు లేఖ రాశారు.. ఇవాళ జరిగిన మీటింగ్ లో కూడా సీడబ్ల్యూసీ ఇదే చెప్పింది.. పదేళ్లు రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి కట్టిన ప్రాజెక్టు కూలింది.. ఆ నాయకులు సిగ్గుపడాలి.. పదేళ్లలో ఎస్ఎల్‌బిసి పూర్తి చేయలేదు.. డిండి ప్రాజెక్టు పూర్తి చేయలేదు.. పదే పదే అబద్ధాలు చెప్పి? నిజం చేయాలని అనుకుంటున్నారు.. పదేళ్ల లో కంటే ఈ రెండేళ్లలో ఎక్కువ నీటి వినియోగం, వరి దిగుబడి వచ్చిందని ఉత్తమ్ వ్యాఖ్యానించారు.

# ఎడ్ సెట్ పోస్టర్‌ను ఆవిష్కరించిన శ్రీధర్ బాబు

**హైదరాబాద్,జనవరి30 :** టి-సాట్ నెట్వర్క్ ఛానళ్లు ప్రసారం చేసే ఎడ్ సెట్ ప్రసారాల షెడ్యూల్ పోస్టర్ ను రాష్ట్ర ఐటి, పరిశ్రమలు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆవిష్కరించారు. సచివాలయంలోని తన ఛాంబర్ లో టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి తో కలిసి ప్రసారాల వివరాలు తెలిపే షెడ్యూల్ పోస్టర్ ను ఆవిష్కరించి మాట్లాడుతూ ఎడ్ సెట్ లో ఉన్నతమైన ర్యాంకులు సాధించేందుకు టి-సాట్ అందించే డిజిటల్ కంటెంట్ ను సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా బీఈడీ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. తెలంగాణ ప్రభుత్వం విద్యకు ప్రత్యేక ప్రధాన్యత నిస్తుందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. టి-సాట్ కంటెంట్ సోషల్ మీడియా ఎ÷-లాట్ ఫాం ద్వార అందుబాటులో ఉ ంటుందని, తద్వారా గ్రామీణ ప్రాంత యువతకు ఎంతో ప్రయోజనం చేకూర్చుతుందన్నారు. తెలంగాణా ప్రభుత్వం నిర్వహించే ప్రతి పోటీ పరీక్షకు టి-సాట్ అందించే డిజిటల్ కంటెంట్ ను సద్వినియోగం చేసుకోవాలని, మే నెలలో జరిగే ఎడ్ సెట్ పరీక్ష కోసం అభ్యర్థులను సిద్ధం చేసేందుకు ఫిబ్రవరి రెండవ తేది నుండి మే 11వ తేది వరకూ రోజుకు నాలుగు గంటల పాటు 392 ఎపిసోడ్స్ ప్రసారం చేస్తున్నామన్నారు మంత్రి శ్రీధర్ బాబు.



.బయాలజీ, పిజికల్ సైన్స్, మాథమేటిక్స్, సోషల్ స్టడీస్, ఇంగ్లీష్, తెలుగు స్జబెక్టులతో 98 రోజుల పాటు టి-సాట్ విద్య, నిపుణ ఛానళ్లతో పాటు టి-సాట్ యాప్, యూట్యూబ్ లో ప్రసారాలు కొనసాగుతాయి. పోటీ పరీక్షలకు డిజిటల్ కంటెంట్ అందించేందుకు కృషి చేస్తున్న సీఈవో వేణుగోపాల్ రెడ్డిని మంత్రి శ్రీధర్ బాబు అభినందించారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో టి-సాట్ ఎగ్జుక్యూటీవ్ డైరెక్టర్ ఎం.డి సాధిక్ పాల్గొన్నారు.

# కేసీఆర్‌కు సిట్ షాక్

మొదటి పేజీ తరువాయి

సంగతి తెలిసిందే. నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి సిట్ అధికారులు వెళ్లి నోటీసులు అందజేశారు. శుక్రవారం మధ్యాహ్నం 3:00 గంటలకు విచారణకు అందుబాటు లో ఉండాలని నోటీసులో స్పష్టం చేశారు. ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్ లోనే విచారించాలన్న కేసీఆర్ అభ్యర్థనను సిట్ తిరస్కరించింది. హైదరాబాద్ నందినగర్లోని నివాసంలో అందుబాటులో ఉండాలని కేసీఆర్ కు సూచించింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరుకావాలని జనవరి 29న 160 సీఆర్ పీసీ కింద సిట్ నోటీసులు జారీ చేసింది. కేసీఆర్ ఫామ్ హౌస్ లో ఉండగా..బంజారాహిల్స్ లోని నందినగర్ లో ఆయన నివాసంలో అధికారులు నోటీసులు అందించారు. జనవరి 30న మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు హాజరుకావాలని తెలిపారు. అయితే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో విచారణకు హాజరుకాలేనని సిట్ అధికారులకు కేసీఆర్ లేఖ రాశారు. ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్ లోనే విచారించాలని అధికారులకు సూచించారు. అలాగే భవిష్యత్ లోనే ఎలాంటి నోటీసులైనా..ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్ అడ్రస్ కే పంపాలని విన్నవించారు. అయితే కేసీఆర్ వినతిపై న్యాయనిపుణులతో చర్చించిన సిట్ ఫామ్ హౌస్ లోనే విచారించాలన్న అభ్యర్థనను తిరస్కరించింది. అలాగే ఫిబ్రవరి 1న మధ్యాహ్నం 3గంటలకు బంజారాహిల్స్ నందినగర్లోని కేసీఆర్ నివాసంలో విచారిస్తామని నోటీసు జారీ చేసింది. శుక్రవారం మున్సిపల్ ఎన్నికల కారణంగా విచారణను వాయిదా వేయాలని కోరారు. మరో రోజు విచారణకు పిలిస్తే తప్పకుండా హాజరవుతానని, విచారణ కోసం వేరే తేదీ నిర్ణయించాలని సిట్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. కేసీఆర్‌ను ఎక్కడ విచారించాలనే దానిపై సిట్ అధికారులు ఈ రోజు సమావేశం నిర్వహించి, న్యాయ నిపుణులతో చర్చించారు. ఈ నేపథ్యంలోనే కేసీఆర్‌ను ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కాకుండా హైదరాబాద్‌లోనే విచారించాలని నిర్ణయించారు.

## కేసీఆర్‌కు నోటీసులపై బీఆర్ఎస్ నిరసన

**భద్రాద్రి కొత్తగూడెం,జనవరి 30 :** లక్ష్మీదేవిపల్లి, జనవరి 30 : మాజీ సీఎం కేసీఆర్‌కు సిట్ అధికారులు నోటీసులు ఇవ్వడంపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ లక్ష్మీదేవిపల్లి శ్రేణులు భగ్గుమన్నాయి. పార్టీ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పిలుపుమేరకు లక్ష్మీదేవిపల్లి మండల అధ్యక్షుడు కొట్టి వెంకటేశ్వరరావు అధ్యక్షతన పార్టీ శ్రేణులు శు క్రవారం కండ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేసీఆర్‌కు సిట్ నోటీసులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బూటకపు కేసులు, విచారణలు పక్కనపెట్టి ముందు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి పనులపై దృష్టి సాధించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ అధ్యక్షుడు ఇగ్బాల్ పాషా, ప్రశాంతి నగర్ ఉప సర్పంచ్ ఎర్రబడి శ్రీను, శ్రీకాంత్ నాయక్, మాజీ సర్పంచులు తాడూరి రజాక్, కోరం చంద్రశేఖర్, పొదిలి వెంకటాచలం, బీఆర్ఎస్ మండల నాయకులు రాజావరపు మురళి, కల్లుగడ్డ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## దానం అనర్హతపై స్పీకర్ విచారణ

**కౌశిక్ రెడ్డి పిటిషన్ ఆధారంగా క్రాస్ ఎగ్జామిన్**
**సమయం కోరిన బిజెపి నేత మహేశ్వరెడ్డి**
**18న విచారణకు హాజరు కావాలని గడువు**

**హైదరాబాద్,జనవరి30 :** పార్టీ ఫిరాయింపు కేసులో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ విచారణ పూర్తయ్యింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి వేసిన పిటిషన్లపై తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విచారణ చేపట్టారు. దానంపై అనర్హత వేటు వేయాలని పాడి కౌశిక్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి పిటిషన్‌లు దాఖలు చేశారు. ముందుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిగింది. దానం తరఫున న్యాయవాదులు కౌశిక్ రెడ్డిని క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. దానంపై పిటిషన్ ఎందుకు వేశారు?.. పార్టీ మారారని చెప్పేందుకు గల ఆధారాలపై పాడి కౌశిక్‌ను ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో తన వద్ద ఉన్న ఆధారాలను స్పీకర్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అందజేశారు. బీఆర్ఎస్ నుంచి దానం పోటీ చేసి ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొందడం, ఆ తరువాత కాంగ్రెస్ నుంచి సికింద్రాబాద్ ఎంపీగా పోటీ చేయడం, దానం ప్రచార ఫొటోలు, వీడియోలు.. దానం కాంగ్రెస్ కండువా వేసుకున్న ఫొటోలను స్పీకర్ ముందు ఉంచారు పాడి కౌశిక్ రెడ్డి. దీంతో స్పీకర్ ఎదుట పాడి కౌశిక్ రెడ్డి విచారణ ముగిసింది. ఇక, దానం నాగేందర్ అనర్హత పిటిషన్‌పై సాక్ష్యాలను అఫిడవిట్ రూపంలో దాఖలు చేశారు బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి. మహేశ్వర్ రెడ్డి తరఫు న్యాయవాదులు.. స్పీకర్ ముందు హాజరయ్యారు. దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించేందుకు ఎవిడెన్స్ అఫిడవిట్‌ను పొందుపరిచానని మహేశ్వర్ రెడ్డి తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తాను వ్యక్తిగతంగా హాజరుకాలేనని ఆయన తెలిపారు. వ్యక్తిగతంగా హాజరు కావాలంటే సమయం కావాలని విజ్ఞప్తి చేశారు. ఫిబ్రవరి 20 తరువాత సమయం ఇస్తే తాను విచారణకు వ్యక్తిగతంగా హాజరవుతానని అఫిడవిట్‌లో మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. దీంతో బీజేపీ పిటిషన్‌పై ఫిబ్రవరి 18న స్పీకర్ విచారించనున్నారు. ఇక, పార్టీ ఫిరాయింపుల కేసు కీలక దశకు చేరుకుంది. ఇప్పటివరకూ పది మంది ఎమ్మెల్యేలపై ఆరోపణలు రాగా.. ఎనిమిది మందికి సంబంధించిన విచారణ పూర్తి అయ్యింది. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి విచారణ జరగాల్సి ఉండగా... దానంను స్పీకర్ విచారించారు. దానం చెప్పే విషయాలను స్పీకర్ పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. గతంలో ఎనిమిది మంది ఎమ్మెల్యేల విచారణ సమయంలోనూ ఇదే జరిగింది. విచారణ సమయంలో ఏ పార్టీలో ఉన్నారనే విషయాన్ని ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కుంటున్న ఎమ్మెల్యేలను స్పీకర్ ప్రశ్నించగా.. వారంతా బీఆర్ఎస్‌లోనే ఉన్నామని సమాధానం ఇచ్చారు. ఇక దానం నాగేందర్ కూడా మొన్నటి వరకు తాను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నానని, అవసరమైతే ఉ పఎన్నికకు వెళ్లేందుకు సిద్ధమని ప్రకటించారు. అయితే గత రెండ్రోజులుగా దానం యూటర్న్ తీసుకున్న పరిస్థితి. తాను బీఆర్ఎస్‌లోనే ఉన్నానని, పార్టీకి ఇంకా రాజీనామా చేయలేదని చెప్పుకొచ్చారు. స్పీకర్ తనపై అనర్హత వేటు వేస్తే.. ఉప ఎన్నికకు సిద్ధమని దానం పదేపదే చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.

## చెంగిచర్లలో ఇళ్లను దోచుకున్న దొంగల పట్టివేత

**బంగారం కరిగించిన వ్యక్తి అరెస్ట్**

**హైదరాబాద్,జనవరి 30 :** అంతర్రాష్ట్ర దొంగలముఠాను పోలీసులు పట్టుకున్నారు. మేడ్చల్ జిల్లా మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని చెంగిచర్ల కనకదుర్గ కాలనీలో జనవరి 15న 9 ఇళ్లలో చోరీకి తెగబడ్డారు అంతర్రాష్ట్ర దొంగలు. కత్తులు, ఇతర మారణాయుధాలతో హల్ చల్ చేశారు. 9 ఇళ్లల్లో తలుపులు, కిటికీలు పగలగొట్టి లోపలకు దూరారు. అంతే కాదు.. బీరువా తాళాలు పగలగొట్టి బంగారం, వెండి వస్తువులతోపాటు అందిన కాడికి నగదు దోచుకుని దర్జాగా వచ్చిన దారినే వెళ్లిపోయారు. ఆ దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. బాధితుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు.. కేసు నమోదు చేసుకున్నారు. పండగపూట సొంతూళ్లకు వెళ్లి వచ్చే సరికి ఇళ్లు గుల్ల చేసిన అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పట్టుకున్నారు. ఈ చోరీలో ముగ్గురు దొంగలు పాల్గొన్నట్లు చెబుతున్నారు పోలీసులు. వారిని డిల్లీకి చెందిన మహాదేవ్ లాల్, పవన్ గుప్త, ఉత్తర ప్రదేశ్‌కి చెందిన మంగళ్ సింగ్‌గా గుర్తించారు. వారి వద్ద నుంచి రూ. 2 లక్షల 4 వేలతోపాటు 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు నిందితులు దోచుకున్న బంగారాన్ని కరిగించిన వ్యక్తిని కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. ఇక పట్టుబడ్డ నిందితులపై ఇప్పటికే ఢిల్లీలో పలు కేసులు ఉన్నట్లు గుర్తించారు పోలీసులు. ఈ కేసులో ప్రధాన నిందితుడుగా ఉన్న మహదేవ్ లాల్ తీహార్ జైలులో శిక్ష అనుభవించినట్లు పోలీసులు గుర్తించారు. పలు దోపిడీ కేసుల్లో పవన్ గుప్త, మంగళ్ సింగ్ తీహార్ జైలుకు వెళ్లిన సమయంలో ముగ్గురు ముఠాగా ఏర్పడి నేరాలు చేయడం స్టార్ట్ చేశారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శనివారం 31 జనవరి 2026




# 4 లక్షల ఉద్యోగాల కల్పనకు కృషి



మొదటి పేజీ తరువాయి

విద్యార్థులతో లోకేశ్ ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాదయాత్ర చేసిన తర్వాత చాలా విషయాలు నేర్చుకున్నానని తెలిపారు. ప్రతి నెలా విద్యార్థులతో మాట్లాడతానని.. ఇలాంటి కార్యక్రమాలు ప్రతి నెలా నిర్వహిస్తామని తెలిపారు. తాను చిన్నప్పుడు బట్టీ పట్టి చదవలేదని, పాఠం మొత్తం విని నేర్చుకునేవాడినని గుర్తుచేశారు. కుంభమేళా కార్యక్రమం చూసి క్రౌడ్ మేనేజ్‌మెంట్ నేర్చుకున్నానని తెలిపారు. 'డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను మొదటిసారి హైదరాబాద్‌లో చంద్రబాబు ఇంటికి భోజనానికి పిలిచినప్పుడు చూశాను. ఆ తర్వాత రాజమండ్రి సెంట్రల్ జైలు వద్ద చంద్రబాబును అరెస్టు చేసిన సమయంలో మా కుటుంబానికి అండగా నిలబడ్డారు. కష్టకాలంలో తోడుగా వచ్చిన వారిని ఎప్పుడూ మరచిపోకూడదు. మీరు కూడా ఈ విషయం గుర్తుంచుకోవాలి' అని విద్యార్థులకు మంత్రి నారా లోకేశ్ సూచించారు. కులం, మతం, ప్రాంతం పేరుతో కొంతమంది గొడవలు పెడుతున్నారని, ఏ కుటుంబంలో పుడతామో ఎవరి చేతుల్లోనూ ఉండదని చెప్పారు. కెమికల్ ఇంజనీరింగ్ మంచి కోర్సు అని, భవిష్యత్తులో అనకాపల్లిలో కెమికల్ ఫార్మా కంపెనీలు పెడతామని లోకేశ్ తెలిపారు. త్వరలో రాష్ట్రానికి 760 కంపెనీలు తీసుకొస్తున్నామని, అగ్రికల్చర్ ఎంత ముఖ్యమో.. పరిశ్రమలు కూడా అంతే ముఖ్యమని మంత్రి నారా లోకేశ్ అన్నారు. దావోస్ వెళ్లి వచ్చిన తర్వాత విశాఖపట్నంలో చాలా కంపెనీలకు శంకుస్థాపన చేశామని చెప్పారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి ఆసక్తికర సమాధానం ఇచ్చారు. 'మీరెప్పుడైనా క్లాస్‌లకు బంక్ కొట్టారా?' అని విద్యార్థులు అడగగా, లోకేశ్ నవ్వుతూ 'తాను ఎప్పుడు బంక్ కొట్టలేదు' అని సమాధానమిచ్చారు. తాను ఎంబీఏ చదువుతున్న సమయంలో 90శాతం అటెండెన్స్ ఉందని, తన భార్య బ్రాహ్మణికి 100 శాతం అటెండెన్స్ ఉందని ఆయన చెప్పారు. విద్యార్థులతో స్నేహపూర్వకంగా సంభాషించిన లోకేశ్.. వారి సందేహాలను నివృత్తి చేశారు.

# అమరావతిలో బిట్స్ పిలానీ క్యాంపస్

## తొలిదశలో వేయికోట్లతో నిర్మాణం.. సీఆర్డీఏతో కుదిరిన ఒప్పందం

**అమరావతి :** రాజధాని అమరావతిలో బిట్స్ పిలానీ నిర్మాణానికి సంబంధించి ఆ సంస్థ ప్రతినిధులు సీఆర్డీఏతో ఒప్పందం చేసుకున్నారు. దేశంలోనే ప్రముఖ విద్యాసంస్థల్లో ఒకటైన బిట్స్.. అమరావతిలో క్యాంపస్ ఏర్పాటు చేయనుంది. దీని కోసం తుళ్లూరు మండలంలోని మందడం, వెంకటపాలెం గ్రామాల పరిధిలో 70 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఈ మేరకు బిట్స్ సంస్థ ప్రతినిధులు సీఆర్‌డీఏతో భూ విక్రయ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీఆర్‌డీఏ ఎస్టేట్స్ విభాగం జాయింట్ డైరెక్టర్ వి.డేవిడ్ రాజు, బిట్స్ పిలానీ తరపున అధీకృత ప్రతినిధిగా డిప్యూటీ రిజిస్ట్రార్ వి.వి.ఎస్.ఎన్. మూర్తి పాల్గొన్నారు. మందడం సబ్ రిజిస్ట్రార్ సి.హెచ్. రాంబాబు సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది. బిట్స్ నిర్మాణ పనులు మొదలైతే... అమరావతి ప్రాంతం ఉన్నత విద్యకు కేంద్రంగా మారే క్రమంలో ముందడుగు పడినట్లవుతుంది. బిట్స్ అమరావతి క్యాంపస్‌ను మూడు దశలుగా అభివృద్ధి చేయనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. మొదటి దశలోనే సుమారు రూ.వెయ్యి కోట్ల పెట్టుబడితో పనులు ప్రారంభించనున్నారు. 2027 నుంచి అమరావతి క్యాంపస్‌లో విద్యార్థులకు ప్రవేశాలు లభించేలా నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేస్తామన్నారు. నవ్యాంధ్ర రాజధాని అమరావతి విద్యా హబ్‌గా రూపాంతరం చెందే దిశలో ఓ భారీ ముందడుగు పడింది. రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణంలో భాగంగా విద్యా రంగానికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం.. బిట్స్ పిలానీ సంస్థకు అవసరమైన భూమిని కేటాయించింది. తుళ్లూరు మండలంలోని మందడం, వెంకటపాలెం పరిధిలో మొత్తం 70.011 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. ఏపీ సీఆర్డీఏ కార్యాలయంలో బిట్స్ ప్రతినిధులు, ప్రభుత్వ అధికారుల మధ్య శుక్రవారం భూ విక్రయ ఒప్పందం పూర్తయింది. మొదటి దశలోనే సుమారు రూ.1,000 కోట్ల భారీ పెట్టుబడితో నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి.

# ఫిబ్రవరి 11 నుంచి అసెంబ్లీ సమావేశాలు

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. 16వ శాసనసభ ఐదో సమావేశాలను ఫిబ్రవరి 11వ తేదీ నుంచి నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ అసెంబ్లీ సమావేశాలపై నోటిఫికేషన్ జారీ చేశారు. ఫిబ్రవరి 11న ఉదయం 10 గంటలకు అమరావతిలోని వెలగపూడిలో ఉన్న అసెంబ్లీ హాలులో ఉభయ సభలను (శాసనసభ, శాసనమండలి) ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించడంతో ఈ సమావేశాలు అధికారికంగా ప్రారంభం కానున్నాయి. గవర్నర్ ప్రసంగం అనంతరం, సభలో ఆయనకు ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగుతుంది. ఫిబ్రవరి 12న ఈ తీర్మానంపై చర్చ ప్రారంభం కానుండగా, ఫిబ్రవరి 13న ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ చర్చకు సమాధానం ఇస్తారు. ఈ సమావేశాల్లో అత్యంత కీలకమైన 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను ఫిబ్రవరి 14న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సభలో ప్రవేశపెట్టనున్నారు. అదే రోజున వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌ను సమర్పిస్తారు. దాదాపు నాలుగు వారాల పాటు ఈ సమావేశాలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ వార్షిక బడ్జెట్‌కు శాసనసభ ఆమోదం పొందడం ఈ సమావేశాల ప్రధాన ఉద్దేశం.

# విద్యుత్ శాఖలో కారుణ్య నియామకాలు

## 27మందికి మంత్రి గొట్టిపాటి నియామక పత్రాలు

**అమరావతి:** విద్యుత్ శాఖలో చనిపోయిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల కింద 27 మంది అర్హులైన అభ్యర్థులకు ఉద్యోగాలు మంజూరు చేశారు. ట్రాన్స్‌కో, జెన్‌కో సహా విద్యుత్ శాఖలోని పలు సంస్థల్లో పనిచేస్తూ మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు ఈ నియామకాలు జరిగాయి. ఈ సందర్భంగా ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నియామక పత్రాలను అందజేశారు. మంత్రి మాట్లాడుతూ.. ట్రాన్స్‌కో, జెన్‌కోలో ఎప్పటికప్పుడు కారుణ్య నియామకాలు చేపడుతున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో అర్హత మేరకు ఇంజినీరింగ్ ఉద్యోగాలు ఒక్కరికీ ఇవ్వలేదని విమర్శించారు. ఉన్నత విద్యార్హత ఉన్నవారికి కూడా ఆఫీసు సబార్డినేట్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు మాత్రమే ఇచ్చారన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అభ్యర్థి అర్హతకు తగిన ఉద్యోగాలు ఇస్తున్నామని తెలిపారు. అర్హులైనవారికి జూనియర్ ఇంజినీర్ ఉద్యోగాలు కూడా కల్పిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు చనిపోయిన ఉద్యోగుల కుటుంబాల్లోని పిల్లలకు 600 మందికి పైగా ఉద్యోగాలు ఇచ్చామని.. కారుణ్య నియామకాల్లో జాప్యం లేకుండా ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేస్తున్నామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు. సీఎస్ కె. విజయానంద్ మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తూ ఉద్యోగులు ఎవరైనా చనిపోతే కారుణ్య నియామకాలు చేపడుతున్నామని అన్నారు. సీఎం ఆదేశాల మేరకు అభ్యర్థుల అర్హతకు తగిన ఉద్యోగాలు ఇస్తున్నామని చెప్పారు. ఏడాది లోపు దరఖాస్తు చేసుకోలేకపోయినవారికి కూడా సడలింపులు ఇచ్చి ఉద్యోగాలు కల్పించామని అన్నారు. ఉద్యోగుల భద్రత, యోగక్షేమాలు కల్పించడం తమ బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రమాదాలబారిన పడిన ఉద్యోగుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. ఉద్యోగంలో చేరిన అభ్యర్థులంతా తమ స్కిల్ పెంచుకుంటూ వృత్తిపరమైన అభివృద్ధి సాధించాలని సీఎస్ విజయానంద్ ఆకాంక్షించారు.

# ఘనంగా మహాత్మాగాంధీ 78వ వర్ధంతి

## రాజ్‌ఘాట్ వద్ద నివాళి అర్పించిన రాష్ట్రపతి, ప్రధాని



**న్యూఢిల్లీ :** మహాత్మా గాంధీ 78వ వర్ధంతి సందర్భంగా రాజ్ ఘాట్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్ర మోదీసహా పలువురు ప్రముఖులు గాంధీకి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖులు, రిటైర్డ్ అధికారులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థులు కూడా పాల్గొన్నారు. రాజ్‌గాట్‌లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ, జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయనకు నా హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నాను. ఆయన విలక్షణ వ్యక్తిత్వం, విజయాలు మన దేశస్థులకు ఎల్లప్పుడూ సరైన మార్గాన్ని చూపిస్తూ ప్రేరణగా ఉంటాయి. అభివృద్ధి చెందిన, స్వావలంబన భారతదేశం కోసం మన సంకల్పానికి ఆయన చిహ్నంగా నిలుస్తారని తెలిపారు. మహాత్మా గాంధీ జీవితం నిజాయితీ, సత్యాగ్రహం, అహింసా మార్గదర్శకాలు మరియు సామాజిక న్యాయం కోసం చేసిన ప్రేరణాత్మక ప్రయత్నాలతో గుర్తింపు పొందింది. ఆయన వ్యక్తిత్వం మరియు విజ్ఞానం యువత, ప్రజలకి సామాజిక సమతా, దేశభక్తి మరియు స్వావలంబన పట్ల ప్రేరణగా నిలుస్తాయి. కార్యక్రమంలో గాంధీకి ప్రత్యేక పుష్పాంజలి, ప్రతిమలకు పూల మాలలు, స్మరణీయ ప్రసంగాలు మరియు సంగీత కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. భక్తులు, స్థానికులు, పర్యాటకులు కూడా భాగస్వామ్యమై, గాంధీ జీవితం, సూత్రాలు గురించి అవగాహన పెంపొందించుకున్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఎక్స్‌లో ట్వీట్ చేసారు. జాతిపిత మహాత్మా గాంధీ 78వ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుడికి ఘన నివాళి అర్పిస్తున్నాను. అహింసా విధానంతో కోట్ల మంది దేశప్రజలను ఒక్కతాటిపై నడిపి స్వాతంత్యం÷-ర సాధించారు. గాంధీజీ బోధనలైన సత్యం, అహింస, శాంతి, సేవ అనే సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ నిత్యం పాటించాలి. స్వదేశీ, మహిళా సాధికారత, గ్రామ స్వరాజ్యం, పేదరిక నిర్మూలన వంటి గాంధీజీ ఆశయాలను నిజం చేసేందుకు చిత్తశుద్ధితో పనిచేద్దామని అన్నారు. వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జాతిపిత మహాత్మా గాంధీకి నివాళు లర్పించారు. 'సత్యం తాత్కాలికంగా ఓడినట్టుగా కనిపించవచ్చు.. కానీ ఎప్పటికీ ఓడదు' అని చెప్పడమే కాక.. తన చివరి శ్వాస వరకు సత్యానికే అంకితమైన జీవితాన్ని గడిపిన మహనీయుడు మహాత్మా గాంధీ. నేడు జాతిపిత వర్ధంతి సందర్భంగా ఆయనకు మనస్ఫూర్తిగా నివాళులు' అని వైఎస్ జగన్ ట్వీట్ ద్వారా పేర్కొన్నారు. ఈ ట్వీట్ ద్వారా గాంధీజీ జీవితాన్ని, ఆయన బోధనలను జగన్ గుర్తుచేసుకున్నారు.

# ఆర్థికమంత్రిగా నిర్మలమ్మ రికార్డు

## వరుసగా తొమ్మిదోసారి బడ్జెట్ సమర్పణ

## అత్యధికసార్లు ప్రవేశ పెట్టిన మహిళా మంత్రిగా ఘనత



**న్యూఢిల్లీ :** నిర్మలా సీతారామన్ ఆర్థికమంత్రిగా చరిత్ర సృష్టించేందుకు సిద్ధమయ్యారు. ఫిబ్రవరి 1న ఆమె పార్లమెంటులో బడ్జెడెట్ ప్రవేశపెట్టనున్న విషయం తెలిసిందే. ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ వరుసగా ప్రవేశపెట్టనున్న 9వ బడ్జెట్ ఇది. పార్లమెంటులో 9 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన రికార్డు మాజీ మంత్రి పి.చిదంబరం సొంతం. 1996లో అప్పటి ప్రధాని హెచ్‌డీ దేవగౌడ సారథ్యంలో మంత్రి చిదంబరం తొలిసారిగా బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. ఆ తరువాత 1997లో రెండోసారి, 2004-08 మధ్య కాలంలో వరుసగా ఐదు సార్లు, 2013, 2014ల్లో మరో రెండు సార్లు ఆయన బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఇక లోక్‌సభలో అత్యంత సుదీర్ఘ బడ్జెట్ ప్రసంగం చేసిన మంత్రిగా నిర్మలా సీతారామన్ ఇప్పటికే అరుదైన గుర్తింపును సొంతం చేసుకున్నారు. భారత్‌కు సంబంధించిన తొలి బడ్జెట్‌ను 1860లో అప్పటి ఆర్థిక మంత్రి జేమ్స్ విల్సన్ ప్రవేశపెట్టారు. భారత మండలి సభ్యుడిగా ఆయన ఈ బడ్జెట్‌ను తీసుకొచ్చారు. 1857 సిపాయి తిరుగుబాటు అనంతరం, భారత ఆర్థిక వ్యవస్థలో సంస్కరణల పేరిట వలసపాలకులు ఈ బడ్జెట్‌ను తీసుకొచ్చారు. ఇక స్వాతంత్యానంతరం, 1947 నవంబర్ 26న భారత దేశ ఆర్థిక మంత్రి ఆర్‌కే షణ్ముఖం చెట్టి తొలి బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టారు. అత్యధిక సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన రికార్డును మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ సొంతం చేసుకున్నారు. మొత్తం 10 బడ్జెట్‌లను ఆయన పార్లమెంటు ముందుకు తెచ్చారు. 1959-64 మధ్యకాలంలో ఆర్థిక మంత్రిగా ఆరు సార్లు, ఆ తరువాత 1967-1969 మధ్య మరో నాలుగు సార్లు ప్రవేశపెట్టారు. ఇక ప్రణబ్ ముఖర్జీ కూడా వివిధ సందర్భాల్లో మొత్తం 8 బడ్జెట్‌లను ప్రవేశపెట్టారు. 1982-84 మధ్యకాలంలో వరుసగా మూడు సార్లు, ఆ తరువాత 2009-12 మధ్య వరుసగా ఐదు సార్లు బడ్జెట్‌ను తీసుకొచ్చారు. ఇక మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ వరుసగా ఐదు సార్లు పీవీ నరసింహారావు ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఇప్పుడు తొమ్మిదోసారి నిర్మలమ్మ బడ్జెట్‌తో ముందుకు రానున్నరు. ఈ మూడేళ్లు ఆమె ఆర్థికమంత్రిగా కొనసాగితే రికార్డు సృష్టించడం ఖాయం.

# స్వాట్ కమాండో హత్య కేసులో దర్యాప్తు

## రికార్డు చేసుకో.. మీ అక్కను చంపేస్తున్నా

## బావమరదికి ఫోన్ చేసి మరీ భార్యను చంపిన దుర్మార్గుడు

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని నగర పోలీసు విభాగంలో స్వాట్ కమాండోగా పనిచేస్తున్న కాజల్ చౌధరి(27)ని ఆమె భర్త అంకుర్ డంబెల్‌తో కొట్టి చంపిన కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. మృతురాలి సోదరుడు నిఖిల్ తాజాగా మీడియాతో మాట్లాడుతూ.. హత్యకు సంబంధించిన పలు కీలక విషయాలు వెల్లడించాడు. 'హత్యకు ముందు నా సోదరి కాల్ చేసి, తన భర్త వేధిస్తున్నట్లు చెప్పింది. అదే సమయంలో అక్కడే ఉన్న అంకుర్ ఆమె నుంచి ఫోన్ లాక్కొని రికార్డు చేసి పెట్టుకో.. పోలీసులకు ఆధారంగా పనికొస్తాయి. మీ అక్కను చంపుతున్నా అని బెదిరించాడు. ఆ సమయంలో అతడిని ఎంత సముదాయించడానికి ప్రయత్నించినప్పటికీ నా మాటలు వినలేదు. కొంతసేపటి తర్వాత అంకుర్ కాల్ చేసి, కాజల్ చనిపోయిందని.. గాజియాబాద్ ఆస్పత్రికి వచ్చి చూసుకొమ్మని చెప్పాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చి ఆస్పత్రికి వెళ్లగా గర్భిణి అయిన నా సోదరి మృతిచెంది ఉందని సోదరుడు నిఖిల్ బావురుమన్నాడు. 2023లో అంకుర్‌తో కాజల్ వివాహం అయిన సమయంలో పెద్ద మొత్తంలో కట్నం ఇచ్చామని, అయినా అత్తింటివారు అదనపు కట్నం కోసం తన కుమార్తెను వేధించేవారని మృతురాలి తల్లి ఆరోపించింది. రక్షణశాఖలో క్లర్క్‌గా పనిచేస్తున్న అంకుర్‌కు ఆర్థికపరమైన అంశాల్లో భార్య కాజల్‌తో తరచూ గొడవలు జరిగేవి. ఈ నెల 22న దంపతుల మధ్య గొడవ తీవ్రరూపం దాల్చడంతో విచక్షణ కోల్పోయిన అంకుర్ ఆమెపై దాడిచేసి, డంబెల్‌తో తలపై కొట్టాడు. తీవ్రంగా గాయపడిన కాజల్ గాజియాబాద్ ఆసుపత్రిలో అయిదు రోజులు మృత్యువుతో పోరాడి మంగళవారం మృతి చెందగా.. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అంకుర్‌ను అరెస్టు చేసిన పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఢిల్లీలోని మోహన్ గార్డెన్ ప్రాంతంలో కాజల్-అంకుర్ నివాసంలో ఈ ఘటన జరిగింది. భర్త.. నిందితుడైన అంకుర్ తన భార్య కాజల్ తలని తలుపు ఫ్రేమ్‌కు బలంగా కొట్టి, ఆపై బరువైన డంబెల్ తో ఆమె తలపై దాడి చేశాడు. దాడి సమయంలో కాజల్ నాలుగు నెలల గర్భిణీ. ఆసుపత్రిలో ఐదు రోజులపాటు మృత్యువుతో పోరాడి, జనవరి 27న కమాండో కాజల్ కన్నుమూశారు. కట్నం వేధింపులే తమ బిడ్డ హత్యకు ప్రధాన కారణమని కాజల్ కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. నిందితుడు అంకుర్ చౌదరి కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖలో క్లర్క్‌గా పనిచేస్తున్నాడు. పెళ్లిలో బుల్లెట్ బైక్, బంగారం ఇచ్చినప్పటికీ, కారు ఇవ్వలేదని అతను తరచూ కాజల్‌ను వేధించేవాడని తెలుస్తోంది. పోలీసులు.. నిందితుడు అంకుర్ చౌదరిని అరెస్ట్ చేసి తీహార్ జైలుకు పంపారు. ముందుగా హత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు.. కాజల్ మరణం తర్వాత దానిని హత్య కేసుగా మార్చారు. కాజల్-అంకుర్ దంపతులకు ఇప్పటికే ఒకటిన్నర ఏళ్ల కుమారుడు ఉన్నాడు. ప్రస్తుతం ఆ బాబు కాజల్ తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు.

# బంగారం ధరల్లో ఒడిదుడుకులు

## ఒక్కరోజులోనే 5లక్షల కోట్లకు క్రాష్


## సాయంత్రానికి తిరిగి పుంజుకున్న మార్కెట్

**న్యూఢిల్లీ:** ప్రస్తుతం ఎక్కడ చూసినా బంగారం, వెండి ధరలపై చర్చ సాగుతోంది. అనూహ్యంగా అడ్డూఅదుపుల లేకుండా పెరుగుతున్న ధరలు ఎందాక పోతాయా అన్న ఆందోళన కనిపిస్తోంది. సామాన్యుల నుంచి బడా ఇన్వెస్టర్లు, వ్యవస్థాగత మదుపర్ల వరకూ అన్ని వర్గాల వారినీ పసిడి ధరల పరుగు ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఏ రోజు ధర ఎంత పెరుగుతుందో? ఎంత తగ్గుతుందో? అసలు పసిడిపై పెట్టుబడికి ఇది సరైన సమయమో కాదో తెలియక సామాన్యుల తలకిందులవు తున్నారు. అయితే, చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా గురువారం బంగారం మార్కెట్ విలువ తీవ్ర హెచ్చుతగ్గులకు లోనైంది. అంతర్జాతీయ అనిశ్చితులతో గత కొన్ని రోజులుగా అసాధారణంగా పెరుగుతున్న బంగారం ధర.. గురువారం రాత్రి అనూహ్యంగా ఒడుదొడులకు లోనై,గంటల వ్యవధిలో దారుణంగా ఊగిసలాడింది. కేవలం ఒక ట్రేడింగ్ సెషన్‌లోనే పసిడి మార్కెట్ విలువ ఏకంగా 5.5 ట్రిలియన్ డాలర్ల హెచ్చుతగ్గులకు గురైందంటే.. ప్రపంచ కమొడిటీ మార్కెట్ల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు..! ఒక్క రోజులో బంగారం మార్కెట్ విలువ ఈ స్థాయిలో మార్పులు రావడం చరిత్రలో ఇదే తొలిసారి. ని స్టాక్ మార్కెట్ వ్యవహారాల కామెంటరీ వేదిక 'ది కొబేసీ లెటర్' నెట్టింట పెట్టిన పోస్టు వైరల్‌గా మారింది. ది కొబేసీ లెటర్' చేసిన ట్వీట్ ప్రకారం, గురువారం ఉదయం అమెరికా కాలమానం ప్రకారం 9.30 గంటల నుంచి 10.25 గంటల మధ్య బంగారం మార్కెట్ విలువ ఒక్కసారిగా 3.2 ట్రిలియన్ డాలర్ల మేర పడిపోయింది. ఆ తరువాత క్రమంగా కోలుకుని మార్కెట్స్ క్లోజ్ అయ్యే సమయానికి కనిష్ఠ స్థితి నుంచి 2.3 ట్రిలియన్ డాలర్ల మేర ఎగబాకింది. అంటే.. ఒక్క సెషన్‌లోనే బంగారం మార్కెట్ క్యాపిటలైజేషన్ హెచ్చుతగ్గుల విలువ 5.5 ట్రిలియన్ డాలర్లను చేరింది. బంగారానికి ఉన్న వాస్తవ డిమాండ్‌కు మించి ధరల్లో ప్రస్తుతం హెచ్చుతగ్గులు నమోదవుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. భౌగోళిక అనిశ్చితులు, డాలర్ బలహీనత, అమెరికా వడ్డీ రేట్లపై అనిశ్చితి వంటి వాటితో పాటు ఇతర కీలక అంశాలు ధరలను ప్రభావితం చేస్తున్నాయని అంటున్నారు. ముఖ్యంగా వ్యవస్థాగత మదుపర్లు కమోడిటీ మార్కెట్స్‌పై దృష్టిపెట్టడం, ఆల్గోరిథమ్-ఆధారిత ట్రేడింగ్ పెరగడం, బంగారం హెచ్చుతగ్గుల ఆధారంగా డెరివేటివ్ మార్కెట్స్‌లో కూడా ట్రేడింగ్ అధికమవడంతో పసిడి ధరలు అంచనాలకు మించి హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి. పసిడితో పాటు వెండి, ఎ÷-లాటినమ్, పెలాడియం వంటి విలువైన లోహాలన్నీ ఇదే స్థాయిలో ఒడిదుడుకులకు లోనుకావడం కమోడిటీ మార్కెట్స్‌లో ఒత్తిడికి సూచిక అని విశ్లేషకులు కామెంట్ చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా బంగారం ధరలకు ఈ ఏడాది బ్రేకులు ఉండకపోవచ్చని ప్రముఖ కన్‌స్టలెన్సీ సంస్థ గోల్డ్‌మన్ శాక్స్ అంచనా వేస్తోంది. అంతర్జాతీయ మార్కెట్స్‌లో ఔన్స్ మేలిమి బంగారం ధర 6 వేల డాలర్ల మార్కు దాటొచ్చనేది మెజారిటీ మార్కెట్ విశ్లేషకుల అంచనా. భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు, వాణిజ్యయుద్ధాల నేపథ్యంలో కరెన్సీ స్థిరత్వంపై ఆందోళనలు, ద్రవ్యోల్బణ భయాలు, వడ్డీరేట్లపై అస్పష్టత వంటి అనేక కారణాలతో ఈ మధ్య మదుపర్లు బంగారం, వెండి లోహాల్లో పెట్టుబడులను సురక్షిత సాధనంగా భావించారు. దీంతో వీటి ధరలకు రెక్కలొచ్చాయి. అయితే, గరిష్ఠాల వద్ద సంస్థాగత మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో గురువారం వీటి విలువ ఒక్కసారిగా తగ్గింది. దీనికితోడు కంప్యూటర్ ఆధారిత ఆటోమెటిక్ అల్గారిథమ్ ట్రేడింగ్ కూడా ధరల కదలికలను తీవ్రంగా ప్రభావితం చేసిందని మార్కెట్ అనలిస్టులు చెబుతున్నారు. నేటి రోజుల్లో బంగారం ట్రేడింగ్ అనేది భౌతిక బంగారం డిమాండ్ మీద మాత్రమే ఆధారపడట్లేదని, ఈటీఎఫ్‌లే మార్కెట్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయని పేర్కొంటున్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శనివారం 31
జనవరి 2026



## హెచ్‌డీఎల్, ఎల్‌డీఎల్ అంటే ఏమిటి..? మన శరీరంలో హెచ్‌డీఎల్ అసలు ఎంత ఉండాలి..?




మన గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో మంచి కొలెస్ట్రాల్ లేదా హెచ్‌డిఎల్ కీలకపాత్ర పోషిస్తుంది. ఇది రక్తంలోని అదనపు కొలెస్ట్రాల్ ను శుభ్రం చేసి గుండె జబ్బుల ముప్పును తగ్గిస్తుంది. హెచ్‌డిఎల్ ఒక స్కావెంజర్ లాగా పని చేస్తుంది. రక్తంలో ఉండే చెడు కొలెస్ట్రాల్ ను కాలేయానికి పంపిస్తుంది. కాలేయం ఈ చెడు కొలెస్ట్రాల్ ను బయటకు పంపుతుంది. దీంతో రక్తనాళాల్లో అడ్డంకులు ఏర్పడవు. ఇక మంచి కొలెస్ట్రాల్ స్థాయిలు 40 ఎమ్జి/డెసి్లీ కంటే తక్కువగా ఉంటే ప్రమాదంగా భావిస్తారు. 40 నుండి 59 ఎమ్జి/డెసి్లీ స్థాయిలను సాధారణంగా పరిగణిస్తారు. 60 ఎమ్జి/డెసి్లీ లేదా అంతకంటే ఎక్కువ స్థాయిలను ఉత్తమంగా పరిగణిస్తారు. ప్రస్తుత కాలంలో మనలో చాలా మంది గుండె జబ్బుల బారిన పడుతున్నారు. శరీరంలో మంచి కొలెస్ట్రాల్ స్థాయిలు ఎక్కువగా ఉండడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు గుండె జబ్బులు వచ్చే అవకాశం కూడా తక్కువగా ఉంటుంది. కనుక మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను ఎలా మెరుగుపరుచుకోవాలో తెలిసి ఉండడం ముఖ్యం.

### ప్రోటీన్లు, ఫైబర్..

ముఖ్యంగా మన జీవనశైలిలో మార్పులు మంచి కొలెస్ట్రాల్ ను పెంచడంలో ఎంతో సహాయపడతాయి. మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచుకోవాలి అనుకునే వారు ధూమపానానికి దూరంగా ఉండాలి. ధూమపానం కారణంగా చెడు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరాయిడ్స్ పెరుగుతాయి. దీని వల్ల ధమనులల్లో అడ్డంకులు ఏర్పడే అవకాశం ఉంది. ధూమ-పానం మానేయడం వల్ల గుండె ప్రమాదాలు చాలా వరకు తగ్గుతాయి. ఆహారంలో పండ్లు, కూరగాయలు, ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండే వాటిని తీసుకోవాలి. వీటిలో ఉండే ఫైబర్ లు, యాంటీ ఆక్సిడెంట్లు మంచి కొలెస్ట్రాల్ ను పెంచుతాయి, చెడు కొలెస్ట్రాల్ ను తగ్గిస్తాయి. ప్రాసెస్ చేసిన ఆహారాలను తీసుకోవడం తగ్గించాలి. అలాగే ప్రతిరోజూ అరగంట పాటు వ్యాయామం చేయాలి. నడక, యోగా వంటివి చేయడం వల్ల మంచి కొలెస్ట్రాల్ తో పాటు గుండె ఆరోగ్యం కూడా పెరుగుతుంది. వారానికి 150 నిమిషాల పాటు ఏరోబిక్ వ్యాయామాలు చేయడం వల్ల శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు.

### గింజలు, విత్తనాలు..

అదే విధంగా ఓట్స్, బాదం, వాల్‌నట్స్, గింజలు, అవిసె గింజలు, చియా గింజలు వంటి వాటిని ఆహారంలో భాగంగా తీసుకోవాలి. ఇక కార్బోహైడ్రేట్స్ ను తీసుకోవడం నియంత్రించాలి. పాల ఉత్పత్తులను కూడా మితంగా తీసుకోవాలి. ఆహారంలో ఆలివ్ నూనె, వేరుశనగ లేదా పొద్దు తిరుగుడు నూనెలను తీసుకోవాలి. తృణ ధాన్యాలు, పప్పు దినుసులను ఎక్కువగా తీసుకునే ప్రయత్నం చేయాలి. ఇలా సమతుల్య ఆహారాన్ని తీసుకుంటూ, వ్యాయామం చేస్తూ, ధూమపానాన్ని మానేయడం వల్ల మన శరీరంలో మంచి కొలెస్ట్రాల్ స్థాయిలు పెరుగుతాయి. గుండె ఆరోగ్యంతో పాటు మొత్తం శరీర ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. అలాగే మన శరీరంలో హెచ్‌డిఎల్ పెరగడం ఎంత ముఖ్యమో, ఎల్‌డిఎల్ తగ్గడం కూడా అంతే ముఖ్యం. అలాగే రక్తపరీక్షలు చేయించుకున్నప్పుడు హెచ్‌డిఎల్ స్థాయిలు తక్కువగా ఉన్నట్లయితే వెంటనే వైద్యుడిని సంప్రదించి జీవన శైలిలో మార్పులు చేసుకోవడం చాలా అవసరమని వైద్యులు చెబుతున్నారు.



## అధిక కొలెస్ట్రాల్ సమస్య ఉందా..? అయితే ఈ లక్షణాన్ని గమనించండి..!

శరీర బరువును అదుపులో ఉంచుకోవడానికి, శరీర ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి చాలా మంది వాకింగ్ చేస్తూ ఉంటారు. వాకింగ్ వంటి వ్యాయామాలు చేయడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుంది. సాధారణంగా మనం వాకింగ్ చేస్తున్నప్పుడు కాళ్లు, తొడలు, పిరుదులు వంటి భాగాల్లో నొప్పి వస్తూ ఉంటుంది. ఇది అడపాదడపా జరుగుతుంది. కొంత విశ్రాంతి తీసుకున్న తరువాత తగ్గిపోతుంది. కానీ వాకింగ్ చేసేటప్పుడు కాళ్ల నొప్పి ఎక్కువగా ఉండడం, విశ్రాంతి తీసుకున్న తరువాత కూడా తగ్గకపోవడం వంటి లక్షణాలు అధిక కొలెస్ట్రాల్ ను కూడా సూచిస్తాయని వైద్యులు తెలియజేస్తున్నారు. అధిక కొలెస్ట్రాల్ సమస్య ఎక్కువగా ఎటువంటి లక్షణాలు చూపించదు. వాకింగ్ చేసేటప్పుడు మన శరీరం కొన్ని లక్షణాలను చూపిస్తుంది.

### కొలెస్ట్రాల్ అడ్డుపడితే..

ధమనుల్లో కొలెస్ట్రాల్ అడ్డుపడడం వల్ల నడిచిన ప్రతిసారి నొప్పితో పాటు వింత అనుభూతి కలుగుతుంది. ధమనుల్లో కొలెస్ట్రాల్ అడ్డుగా ఉండడం వల్ల నడిచేటప్పుడు ఆక్సిజన్ ఉన్న రక్తం సరిగ్గా సరఫరా అవ్వదు. దీంతో నడిచేటప్పుడు నొప్పితో పాటు కాళ్లు బరువుగా ఉండడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. మెట్లు ఎక్కడం కూడా కష్టంగా అనిపిస్తుంది. ఈ సమస్యను నిర్లక్ష్యం చేయడం వల్ల కాలక్రమేణా రక్తప్రసరణ బలహీనపడుతుంది. కండరాలు కుచించుకుపోతాయి. కొంతకాలానికి నడవడం, నిలబడడం కూడా కష్టతరంగా మారుతుంది. అంతేకాకుండా నడిచిన తరువాత ఒక కాలు చల్లగా మరో కాలు వేడిగా ఉండడం వంటి లక్షణాలు కూడా ధమనుల్లో అధిక కొలెస్ట్రాల్ ను సూచిస్తాయి. రక్తం వెచ్చగా ఉంటుంది. రక్తప్రసరణ సరిగ్గా జరగకపోవడం వల్ల కాలు తగినంత వేడెక్కక చల్లగా ఉంటుంది. నడిచిన తరువాత కాలు చల్లగా ఉండడం, కాలు రంగు మారడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదు.

### కాళ్లల్లో తిమ్మిర్లు, గుచ్చినట్లుగా ఉండడం..

అలాగే నడిచేటప్పుడు కాళ్లు తిమ్మిర్లు రావడం, గుచ్చినట్టుగా ఉండడం కూడా ఒక సంకేతమే. నడిచేటప్పుడు నరాలకు ఆక్సిజన్ తో కూడిన రక్తం నిరంతరం సరఫరా అవ్వాలి. ధమనుల్లో కొలెస్ట్రాల్ పేరుకుపోవడం వల్ల రక్తం సరఫరా అవ్వక నరాల పనితీరు దెబ్బతింటుంది. దీంతో పాదాల్లో తిమ్మిర్లు, మంట, స్పర్శ కోల్పోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఈ సమస్యను నిర్లక్ష్యం చేసేకొద్దీ పాదాలపై అల్సర్లు, ఇన్ఫెక్షన్లు, పాదాలపై నెమ్మదిగా గాయాలు అయ్యే ప్రమాదం కూడా ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

### పాదాల రంగు మారడం..

అలాగే అధిక కొలెస్ట్రాల్ సమస్యతో బాధపడే వారిలో నడిచిన తరువాత పాదాల రంగు మారుతుంది. చర్మం పాలిపోయినట్టు కనబడడం, నీలి లేదా ఊదా రంగులో కనబడడం వంటి లక్షణాలు అధిక కొలెస్ట్రాల్ ను సూచిస్తాయి. ధమనుల్లో కొలెస్ట్రాల్ పేరుకుపోవడం వల్ల చర్మ కణజాలానికి ఆక్సిజన్ సరఫరా తగ్గడం వల్ల ఇలా జరుగుతుంది. సమస్య పెరిగే కొద్ది కాళ్లపై వెంట్రుకలు ఊడిపోవడం, కాలి వేళ్లపై, పాదాలపై నయం కాని పుండ్లు పడడం కూడా జరుగుతుంది. కనుక నడిచే సమయంలో ఇటువంటి లక్షణాలను గమనించిన వెంటనే వైద్యుడిని సంప్రదించడం మంచిది. అధిక కొలెస్ట్రాల్ సమస్య గుండె జబ్బులకు, స్ట్రోక్ వంటి సమస్యలకు దారి తీస్తుంది. కనుక అధిక కొలెస్ట్రాల్ సమస్యను అస్సలు నిర్లక్ష్యం చేయకూడదని వైద్యులు సూచిస్తున్నారు.

## సోంపు గింజల నీరు, వాము నీరు.. ఎలాంటి లాభాలను అందిస్తాయి..? వేటిని తీసుకోవాలి..?

భారతీయుల వంటగదుల్లో ఆరోగ్యానికి మేలు చేసే అనేక దినుసులు ఉంటాయి. సోంపు, వాము ఇవి రెండు కూడా వాటిలో భాగమనే చెప్పవచ్చు. జీర్ణ సమస్యలను తగ్గించడంలో ఇవి రెండు కూడా అద్భుతంగా పని చేస్తాయి, భిన్న మార్గాల్లో పనిచేస్తాయి. చాలా మంది వీటిని వంటల్లో వాడడంతో పాటు వీటితో నీటిని తయారుచేసుకుని తాగుతూ ఉంటారు. వాము నీరు, సోంపు నీరు రెండూ మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. వీటి ప్రయోజనాలను తెలుసుకోవడం వల్ల మన శరీర అవసరాలకు ఏది సరైనదో నిర్ధారించుకోవచ్చు. వాము నీరు, సోంపు నీరు వల్ల మనకు కలిగే ప్రయోజనాలు, వీటిని ఎలా తయారు చేసుకోవాలి.. అన్న వివరాలను తెలుసుకుందాం.



### సోంపు నీరు..

సోంపు నీరు దాని శీతలీకరణ లక్షణాలకు, రుచికి ప్రసిద్ధి చెందింది. కనుక పిల్లలు కూడా దీనిని ఇష్టపడతారు. ఈ నీటిని తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ సడలించబడుతుంది. ఉబ్బరం తగ్గుతుంది. జీర్ణక్రియ సాఫీగా సాగుతుంది. గ్యాస్, ఆమ్లత్వం వంటి సమస్యలతో బాధపడే వారు సోంపు నీటిని తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ఈ నీటిని తీసుకోవడం వల్ల ఆహారం సమర్థవంతంగా విచ్ఛినం చేయబడుతుంది. భారీ భోజనం చేసిన తరువాత గుండెల్లో మంట, ఆమ్లత్వం వంటి సమస్యలు తలెత్తుతాయి. అలాంటి సమయంలో సోంపు నీటిని తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ఇక ఈ నీటిని తయారు చేసుకోవడానికి ఒక గ్లాస్ నీటిలో ఒక టీ స్పూన్ సోంపు గింజలు వేసి రాత్రంతా నానబెట్టి ఉదయాన్నే తీసుకోవాలి లేదా గ్లాస్ నీటిలో సోంపు గింజలు వేసి బాగా మరిగించిన తరువాత కూడా తీసుకోవచ్చు. ఈ విధంగా సోంపు నీటిని తయారు చేసి తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థకు ఎంతో మేలు కలుగుతుంది.

### వాము నీరు..

వాము నీరు బలమైన, ఘాటు రుచిని కలిగి ఉంటుంది. ఇది దాని వెచ్చని స్వభావానికి ప్రసిద్ధి చెందింది. వాములో థైమోల్ అనే సమ్మేళనం ఉంటుంది. జీర్ణక్రియను ఉత్తేజపరచడంతో పాటు అజీర్ణం, కడుపులో అసౌకర్యం వంటి సమస్యలను తగ్గించడంలో ఇది సహాయపడుతుంది. గ్యాస్, మలబద్దకం, కడుపు నొప్పి వంటి సమస్యలను తగ్గించడంలో వాము నీరు ప్రయోజనకరంగా ఉంటుంది. అలాగే పేగు కదలికలను సంక్రియం చేయడంలో, పేగు కదలికలను మెరుగుపరచడంలో ఈ నీరు మనకు సహాయపడుతుంది. జీర్ణక్రియ మందగించడం, ఉబ్బరం వంటి లక్షణాలతో బాధపడే వారు ఈ నీటిని తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ఇక ఈ నీటిని తయారు చేసుకోవడానికి గాను ఒక గిన్నెలో ఒక గ్లాస్ నీటిని తీసుకుని అందులో ఒక టీ స్పూన్ వాము వేసి బాగా మరగించాలి. తరువాత వడకట్టి గోర-ువెచ్చగా తీసుకోవాలి. ఇలా తీసుకోవడం వల్ల జీర్ణ సమస్యలు తగ్గుతాయి.

ఇక ఈ రెండింటిలో దేనిని ఎంచుకోవాలి అనే విషయానికి వస్తే ఆమ్లత్వం, గుండెల్లో మంట వంటి సమస్యలతో బాధపడే వారు సోంపు నీటిని తీసుకోవాలి. జీర్ణక్రియ నెమ్మదించడం, గ్యాస్, ఉబ్బరం, మలబద్దకం వంటి సమస్యలతో బాధపడే వారు వాము నీటిని ఎంచుకోవాలి. కొందరు తమ జీర్ణ అవసరాలను బట్టి రెండింటినీ ఎంచుకోవచ్చు. అయితే జీర్ణసమస్యలు మరీ ఎక్కువగా ఉన్నవారు వీటిని తీసుకోవడానికి బదులుగా వైద్యుడిని సంప్రదించడం మంచిది. అలాగే వీటిని మితంగా తీసుకున్నప్పుడే మనకు వాటి వల్ల కలిగే ప్రయోజనాలు అందుతాయని వైద్యులు చెబుతున్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శనివారం 31
జనవరి 2026



# ఇండియా- పాకిస్థాన్ మ్యాచ్‌కి సెక్యూరిటీ పెంచిన శ్రీలంక




ప్రస్తుతం న్యూజిలాండ్‌తో ఇండియా, ఆస్ట్రేలియాతో పాకిస్థాన్ టీ20 సిరీస్‌లు ఆడుతున్నాయి. కానీ వరల్డ్ క్రికెట్ ఫ్యాన్స్ మాత్రం టీ20 ప్రపంచ కప్ 2026 కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా శ్రీలంకలో ఫిబ్రవరి 15న జరగనున్న ఇండియా జం పాకిస్థాన్ మ్యాచ్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. అయితే ఆసియా కప్ సమయంలో ఇక పాకిస్థాన్, ఇండియాకి పోటీయే కాదని కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అన్నాడు. చాలా మంది అభిప్రాయం కూడా ఇదే. అయితే రాజకీయ ఉద్రిక్తతలు, ఇటీవల పాకిస్థాన్ నుంచి వస్తున్న ప్రకటనల కారణంగా మ్యాచ్ చర్చనీయాంశంగా మారింది. ఇన్ని వివాదాల మధ్య ఈ సారి మ్యాచ్ ఎలా జరుగుతుందనే క్యూరియాసిటీ ఫ్యాన్స్‌లో పెరుగుతోంది. ఇండియా- పాకిస్థాన్ మ్యాచ్ సెన్సిటివిటీని దృష్టిలో ఉ ంచుకుని, శ్రీలంక అధికారులు సెక్యూరిటీ అరేంజ్‌మెంట్స్ టైట్ చేశారు. టోర్నమెంట్ సజావుగా జరిగేలా చూసుకోవడానికి శ్రీలంక 'హైయెస్ట్ ప్రయారిటీ' ఇచ్చిందని లంక క్రీడాశాఖ మంత్రి సునీల్ కుమార గమాగే 'కి తెలిపారు. ఇండియా-పాకిస్థాన్ మ్యాచ్‌లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. రెండు టీమ్‌లని ప్రొటెక్ట్ చేయడానికి ఎలైట్ కమాండో యూనిట్లను మోహరించనున్నారు. టీమ్స్ ఎయిర్‌పోర్ట్‌కి చేరుకున్న క్షణం నుంచి వారు దేశం విడిచి వెళ్లే వరకు, ఆర్మ్‌డ్ ప్రొటెక్షన్‌లో ఉంటారని అధికారులు తెలిపారు. బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు తమ ప్రపంచ కప్ మ్యాచ్‌ల కోసం ఇండియాకి వెళ్లడానికి నిరాకరించింది. తాము ఆడే మ్యాచ్‌లను శ్రీలంకకు మార్చాలని కోరగా.. చివరి నిమిషయంలో షెడ్యూల్, వెన్యూలు మార్చడం కుదరదని ఐసీసీ స్పష్టం చేసింది. వరల్డ్ కప్ కో-హోస్ట్‌గా ఉన్న శ్రీలంక కూడా గ్రూప్ మారడానికి అంగీకరించలేదు. దీంతో బంగ్లాదేశ్ టోర్నమెంట్ నుంచి పూర్తిగా వైదొలగక తప్పలేదు. ఇప్పుడు బంగ్లా స్థానంలో స్కాట్‌లాండ్ ప్రపంచ కప్ ఆడుతుంది.

పాకిస్థాన్ బంగ్లాదేశ్‌కు బహిరంగంగా మద్దతు ఇచ్చింది. సిచ్యువేషన్‌ని సక్రమంగా హ్యాండిల్ చేయలేదని అసంతృప్తి వ్యక్తం చేసింది. బంగ్లాదేశ్ కోరిన మార్పులు సరైనవేనని, వాటికి అంగీకరించాల్సిందని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ప్రకటించింది. టెలికాం ఆసియా స్పోర్ట్ నివేదిక ప్రకారం, బంగ్లాదేశ్‌కు సపోర్ట్‌గా పాకిస్థాన్ భారత్‌తో జరిగే మ్యాచ్‌ను బైకాట్ చేయాలని ప్లాన్ చేస్తోంది. పాకిస్థాన్ ఆడాల్సిన ఇతర రెండు గ్రూప్ మ్యాచ్‌లను గెలిస్తే, భారత్‌తో జరిగే మ్యాచ్‌ను బహిష్కరించే అవకాశాలు ఉంటాయని పీసీబీ అధికారి ఒకరు చెప్పినట్లు రిపోర్ట్ పేర్కొంది. బంగ్లాదేశ్ సమస్యను పరిష్కరించిన తీరును తప్పుబడుతూ ఐసిసి కి అఫీషియల్ లెటర్ రాయాలని పాకిస్థాన్ క్రికెట్ బోర్డ్ ఆలోచిస్తోంది. అయితే ఇప్పటివరకు ఎటువంటి అధికారిక నిర్ణయం ప్రకటించలేదు. మొత్తానికి రాజకీయ ఉద్రిక్తతలు టీ20 వరల్డ్ కప్‌పై మరింత ఆసక్తిని పెంచాయి. దీంతో టోర్నీకి ఎప్పుడూ జరగనంత ప్రచారం జరుగుతోంది. చివరి వరకు ఆడే టీమ్స్ కన్‌ఫర్మ్ కాకపోవడంతో షెడ్యూల్ ప్రకారం మ్యాచ్‌లు జరుగుతాయా? లేదా? అనే సందిగ్ధం నెలకొంది.




## ఒలివియా గాడెకీ - జాన్ పీర్స్ జోడీ అద్భుతం

ఆస్ట్రేలియన్ ఓపెన్ 2026లో ఆతిథ్య దేశానికి చెందిన జోడీ సరికొత్త చరిత్ర సృష్టించింది. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో వరుసగా రెండో ఏడాది టైటిల్ గెలుచుకుని, దశాబ్దాల కాలం నాటి రికార్డులను తిరగరాసింది. మెల్‌బోర్న్ వేదికగా జరుగుతున్న ఆస్ట్రేలియన్ ఓపెన్ 2026లో ఒలివియా గాడెకీ - జాన్ పీర్స్ జోడీ అద్భుతం చేసింది. మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్‌లో ఈ ఆస్ట్రేలియా జోడీ ఫ్రాన్స్‌కు చెందిన క్రిస్టినా మ్లాడెనోవిక్ - మాన్యుయెల్ గినార్డ్ జోడీపై అద్భుత విజయం సాధించి విజేతలుగా నిలిచారు. ఈ విజయంతో గాడెకీ - పీర్స్ జోడీ పలు అరుదైన రికార్డులను తన ఖాతాలో వేసుకుంది. ఆస్ట్రేలియన్ ఓపెన్ చరిత్రలో ఒక మిక్స్‌డ్ డబుల్స్ జోడీ వరుసగా రెండుసార్లు టైటిల్ నెగ్గడం 37 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి. చివరిసారిగా 1989లో యానా నోవోత్నా - జిమ్ పుగ్ జంట ఈ ఘనత సాధించింది. ఒక ఆస్ట్రేలియా జంట వరుసగా రెండుసార్లు తమ సొంత గడ్డపై టైటిల్ నిలబెట్టుకోవడం 62 ఏళ్ల తర్వాత ఇదే మొదటిసారి. 1964లో మార్గరెట్ కోర్ట్ - కెన్ ఫ్లెచర్ జోడీ చివరిసారిగా ఈ ఫీట్ సాధించింది. రోడ్ లేవర్ ఎరీనాలో జరిగిన ఈ ఫైనల్ మ్యాచ్ అభిమానులను ఉర్రూతలూగించింది. ఫ్రాన్స్ జోడీ ఆది నుంచే దూకుడు ప్రదర్శించి 6-4తో తొలి సెట్‌ను కైవసం చేసుకుంది. గట్టి పోటీ ఎదురైనప్పటికీ, హోమ్ క్రౌడ్ మద్దతుతో ఆస్ట్రేలియా జోడీ పుంజుకుని 6-3తో రెండో సెట్‌ను గెలిచి మ్యాచ్‌ను టైబ్రేకర్ వరకు తీసుకెళ్లింది. 10 పాయింట్ల టైబ్రేకర్‌లో ఒక దశలో గాడెకీ - పీర్స్ 5-7తో వెనుకబడ్డారు. కానీ ఒత్తిడిని అధిగమించి వరుస పాయింట్లతో 10-8తో విజయాన్ని అందుకున్నారు. రెండో ఛాంపియన్‌షిప్ పాయింట్ సాధించగానే స్టేడియం మొత్తం హర్షధ్వానాలతో మారుమోగిపోయింది. ఆస్ట్రేలియా టెన్నిస్ చరిత్రలో ఈ జోడీ పేరు శాశ్వతంగా నిలిచిపోనుంది.

## కోహ్లీ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ మాయం..




టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ గురువారం (జనవరి 29న) రాత్రి అకస్మాత్తుగా మాయమైంది. అయితే తాను సోషల్ మీడియా నుంచి వెళ్లిపోతున్నాను లేదా కొంతకాలం దూరంగా ఉంటున్నాను అని ఎలాంటి పోస్ట్ చేయలేదు. దాంతో విరాట్ కోహ్లీ అభిమానులు ఇన్‌స్ట్రాగ్రామ్ అకౌంట్ మిస్ కావడంపై ఆశ్చర్యపోయారు. క్రికెటర్ కోహ్లీనే తన అకౌంట్ డిలీట్ చేశాడా లేదా ఏదైనా కారణాలతో జరిగిందా అని ఫ్యాన్స్ ఆందోళన చెందుతున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలోవర్ల పరంగా చూస్తే క్రికెటర్లలో విరాట్ కోహ్లీనే నెంబర్ వన్. ప్రపంచంలో అత్యధిక ఫాలోవర్లు ఉన్న ఆటగాళ్లలో కోహ్లీ ఒకడు. ఇన్‌స్టాగ్రామ్‌లో కోహ్లీకి 274 మిలియన్ల మంది ఫాలోవర్లు ఉన్నారు. తాజాగా కోహ్లీ అభిమానులు అతని ఇన్‌స్టా అకౌంట్ సెర్చ్ చేయగా ఏమీ కనిపించడం లేదు. అసలేం జరిగింది అని కింగ్ కోహ్లీ ఫ్యాన్స్ ఆలోచిస్తున్నారు. విరాట్ కోహ్లీ ప్రస్తుతం తన కుటుంబంతో కలిసి లండన్‌లో నివాసం ఉంటున్నాడు. కోహ్లీ, అనుష్క శర్మ దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. అతను టెస్ట్, టీ20 ఫార్మాట్ల నుండి రిటైర్ అయ్యాడు. కోహ్లీ కేవలం వన్డేల్లో మాత్రమే టీమిండియా తరపున ప్రాతినిథ్యం వహిస్తున్నాడు. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన వన్డే సిరీస్ కోసం కోహ్లీ భారతదేశానికి వచ్చాడు, ఆ సిరీస్ ముగిసిన వెంటనే లండన్ తిరిగి వెళ్ళాడు. విరాట్ కోహ్లీ ఒక్క ఇన్‌స్టాగ్రామ్ పోస్టుకు కోట్లలో సంపాదిస్తారని తెలిసిందే. దాంతో కోహ్లీ సోషల్ మీడియా నుంచి బ్రేక్ తీసుకున్నాడా అని అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. అందుకు సంబంధించి ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ స్క్రీన్‌షాట్‌లను షేర్ చేస్తున్నారు. విరాట్ కోహ్లీ సోదరుడు వికాస్ కోహ్లీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా కూడా కనిపించడం లేదని పేర్కొంటున్నారు. ఇప్పుడు, ఇద్దరి ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లు ఏదైనా టెక్నికల్ ప్రాబ్లం కారణంగా కనిపంచడం లేదా, లేక వాళ్లే డీయాక్టివేట్ చేసుకున్నారా అనే ప్రశ్న తలెత్తుతుంది. త్వరలోనే దీనిపై కోహ్లీ స్పందించి పోస్ట్ చేసే అవకాశం ఉంది.

## సూర్యకు అరుదైన ఫీట్ సాధ్యమేనా?




క్రికెట్ ప్రపంచంలో టీ20 ఫార్మాట్ అంటేనే ఒక రేంజ్ క్రేజ్ ఉంటుంది. అందులోనూ వరల్డ్ కప్ లాంటి మెగా టోర్నీలో టీమ్ ఇండియాను నడిపించడం అంటే అది ఒక అరుదైన గౌరవం. ఇప్పటివరకు మన జట్టును ముగ్గురు దిగ్గజ కెప్టెన్లు మాత్రమే ఈ టోర్నీలో లీడ్ చేశారు. ఇప్పుడు ఆ జాబితాలోకి మన మిస్టర్ 360 ప్లేయర్ సూర్యకుమార్ యాదవ్ అడుగుపెట్టబోతున్నారు. ఫిబ్రవరి 7న ముంబై వేదికగా అమెరికాతో జరిగే మ్యాచ్‌తో ఈ కొత్త ప్రయాణం మొదలవ్వబోతోంది. టీ20 వరల్డ్ కప్ చరిత్రలో భారత్ తరపున కెప్టెన్సీ చేయడం అంటే అది మామూలు విషయం కాదు. ఇప్పటివరకు 'తలా' ధోనీ, 'కింగ్' కోహ్లీ, 'హిట్ మ్యాన్' రోహిత్ శర్మ మాత్రమే ఈ ఘనత సాధించారు. ఇప్పుడు ఈ ముగ్గురి సరసన సూర్యకుమార్ యాదవ్ పేరు చేరబోతోంది. ఫిబ్రవరి 7న అమెరికాతో జరిగే పోరులో టాస్ వేయగానే.. భారత్‌ను వరల్డ్ కప్‌లో నడిపించిన నాలుగో కెప్టెన్‌గా సూర్య చరిత్ర సృష్టిస్తారు. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న జట్టుకు నాయకత్వం వహించడం సూర్యకు ఒక పెద్ద సవాలే అని చెప్పవచ్చు.టీ20 వరల్డ్ కప్ లో భారత్ ప్రయాణాన్ని చూస్తే, ఎంఎస్ ధోనీ ఏకంగా ఐదు ఎడిషన్లలో (2007, 2009, 2012, 2014, 2016) జట్టును నడిపించారు. ఆయన సారథ్యంలోనే 2007లో భారత్ మొదటిసారి ఛాంపియన్‌గా నిలిచింది. ఆ తర్వాత విరాట్ కోహ్లీ 2021లో కెప్టెన్సీ బాధ్యతలు తీసుకున్నా, దురదృష్టవశాత్తు భారత్ సెమీస్ చేరలేకపోయింది. ఇక రోహిత్ శర్మ 2022లో సెమీస్ వరకు తీసుకెళ్లి, 2024లో అద్భుతమైన విక్టరీతో భారత్‌కు రెండోసారి కప్పు అందించారు. ఇప్పుడు ఈ లెజెండరీ కెప్టెన్ల వారసత్వాన్ని సూర్య ముందుకు తీసుకువెళ్లాల్సి ఉంది.ప్రస్తుతం సూర్యకుమార్ యాదవ్ ముందు ఒక అరుదైన అవకాశం ఉంది. ఒకవేళ భారత్ ఈసారి కప్పు గెలిస్తే.. ధోనీ, రోహిత్ తర్వాత టైటిల్ గెలిచిన మూడో భారత కెప్టెన్‌గా సూర్య నిలుస్తారు. విరాట్ కోహ్లీకి సాధ్యం కాని ఈ ఘనతను సూర్య సాధిస్తాడా అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. హోమ్ గ్రౌండ్ అడ్వాంటేజ్ ఉ ండటం, అలాగే 2024 విక్టరీ తర్వాత టీమ్ ఫుల్ ఫామ్‌లో ఉండటం సూర్యకు కలిసొచ్చే అంశాలు. బ్యాటర్‌గా ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన సూర్య, ఇప్పుడు లీడర్‌గా తన సత్తా ఏంటో చూపించాలనుకుంటున్నారు. 2026 వరల్డ్ కప్ గనుక భారత్ గెలిస్తే, క్రికెట్ చరిత్రలో ఎన్నో 'ఫస్ట్ టైమ్' రికార్డులు మన పేరిట నమోదవుతాయి. మూడు టీ20 వరల్డ్ కప్?లు గెలిచిన మొదటి జట్టుగా భారత్ రికార్డు సృష్టిస్తుంది. అంతేకాదు, వరుసగా రెండు ఎడిషన్లు గెలిచిన తొలి టీమ్ గా కూడా నిలుస్తుంది. మరో ముఖ్యమైన విషయం ఏంటంటే.. ఇప్పటివరకు ఏ ఆతిథ్య దేశం కూడా టీ20 వరల్డ్ కప్ గెలవలేదు. ఈసారి సూర్య సేన గెలిస్తే, హోమ్ గ్రౌండ్‌లో కప్పు గెలిచిన మొదటి దేశంగా భారత్ రికార్డ్ క్రియేట్ చేస్తుంది. 2024 వరల్డ్ కప్ ఫైనల్ అనగానే మనందరికీ సూర్యకుమార్ యాదవ్ పట్టిన ఆ అద్భుతమైన క్యాచ్ గుర్తుకొస్తుంది. సౌత్ ఆఫ్రికా చేతుల్లోకి వెళ్లిన మ్యాచ్‌ను ఆ ఒక్క క్యాచ్‌తో సూర్య భారత్ వైపు తిప్పేశారు. అప్పుడు ప్లేయర్‌గా కప్పు గెలవడంలో కీలక పాత్ర పోషించిన సూర్య, ఇప్పుడు నాయకుడిగా ఆ కప్పును కాపాడుకోవాలని చూస్తున్నారు. తన బ్యాటింగ్ స్కిల్స్‌తో పాటు కెప్టెన్సీ వ్యూహాలతో టీమ్ ఇండియాను వరుసగా రెండోసారి విశ్వవిజేతగా నిలబెట్టాలని సూర్య పట్టుదలతో ఉన్నారు. మార్చి 8న జరిగే ఫైనల్‌లో సూర్య ఆ ట్రోఫీని ఎత్తుతాడా అని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇక సీనియర్లు లేని లోటును సూర్య తన నాయకత్వంతో భర్తీ చేస్తూ భారత్‌కు మూడోసారి ప్రపంచకప్ అందిస్తాడో లేదో చూడాలి.




# 'వారణాసి' రిలీజ్ డేట్ ఫిక్స్

## అధికారికంగా ప్రకటించిన రాజమౌళి

ప్రపంచవ్యాప్తంగా సినీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న పాన్-ఇండియన్ చిత్రం 'వారణాసి' విడుదల తేదీని దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి అధికారికంగా ప్రకటించారు. సూపర్ స్టార్ మహేశ్ బాబు కథానాయకుడిగా నటిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రం వచ్చే ఏడాది, అంటే 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. కొంతకాలంగా ఈ సినిమా విడుదల తేదీపై ఊహాగానాలు వినిపిస్తున్నప్పటికీ, శుక్రవారం చిత్ర బృందం దీనిపై స్పష్టతనిచ్చింది. ఈ సందర్భంగా దర్శకుడు రాజమౌళి తన ఎక్స్ ఖాతాలో రిలీజ్ డేట్ పోస్టర్‌ను పంచుకుంటూ, "2027... ఏప్రిల్ 7... చవారా=ూచీూూ×" అని పోస్ట్ చేశారు. దాదాపు అదే సమయంలో మహేశ్ బాబు కూడా ఇదే పోస్ట్‌ను తన సోషల్ మీడియాలో షేర్ చేయడంతో అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. దీంతో సినిమా విడుదలపై వస్తున్న అన్ని రకాల ప్రచారాలకు తెరపడినట్లయింది. గత ఏడాది హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్‌సిటీలో వేలాది మంది అభిమానుల సమక్షంలో ఈ సినిమా టైటిల్‌ను అట్టహాసంగా ప్రకటించిన విషయం తెలిసిందే. అంతకుముందు ఈ చిత్రానికి 'గ్లోబ్‌ట్రాటర్' అనే వర్కింగ్ టైటిల్ ప్రచారంలో ఉండేది. భారత సినీ చరిత్రలోనే అతిపెద్ద ఫ్యాన్ ఈవెంట్‌లలో ఒకటిగా నిలిచిన ఆ కార్యక్రమంలో, సినిమా కోసం ఏర్పాటు చేసిన 100 అడుగుల ఎత్తు, 130 అడుగుల వెడల్పు గల భారీ స్క్రీన్ అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇక ఈ చిత్రంలో మహేశ్ బాబు 'రుద్ర' అనే శక్తిమంతమైన పాత్రలో కనిపించనుండగా, బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా 'మందాకిని' పాత్రలో నటిస్తున్నారు. ప్రముఖ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ 'కుంభ' అనే ప్రతినాయకుడి పాత్రలో ప్రేక్షకులను భయపెట్టనున్నారు. ఇప్పటికే విడుదలైన వీరి ఫస్ట్ లుక్స్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. టైటిల్ లాంచ్ ఈవెంట్‌లో రాజమౌళి మాట్లాడుతూ, సినిమాలోని ఒక కీలక ఎపిసోడ్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. "చిన్నప్పటి నుంచి నాకు రామాయణం, మహాభారతం అంటే ఇష్టమని చెప్పాను. మహాభారతం తీయాలన్నది నా కల. కానీ ఈ సినిమా కోసం రామాయణంలోని ఒక ముఖ్యమైన ఘట్టాన్ని చిత్రీకరిస్తానని ఊహించలేదు. మహేశ్ బాబును రాముడి గెటప్‌లో చూసినప్పుడు నాకు ఒళ్ళు గగుర్పొడిచింది" అని అన్నారు. ఆ ఎపిసోడ్‌ను సుమారు 60 రోజుల పాటు చిత్రీకరించామని, ప్రతి రోజు ఒక సవాల్‌గా అనిపించిందని, తన కెరీర్‌లోనే ఇది అత్యంత గుర్తుండిపోయే సన్నివేశాల్లో ఒకటిగా నిలుస్తుందని రాజమౌళి ధీమా వ్యక్తం చేశారు. తాజా ప్రకటనతో ఈ సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.

## జియో హాట్‌స్టార్‌లోకి 6న వస్తున్న రాజాసాబ్

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో వచ్చిన ఫాంటసీ హారర్ కామెడీ చిత్రం 'ది రాజాసాబ్'. సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. జియో హాట్‌స్టార్ వేదికగా ఫిబ్రవరి 6 నుంచి స్ట్రీమింగ్ కానుంది. దేవనగర సంస్థానానికి ఒకప్పుడు జమిందారు గంగాదేవి (జరీనా వహాబ్). అంత గొప్ప నేపథ్యమున్నా తన మనవడు రాజు అలియాస్ రాజాసాబ్ (ప్రభాస్)తో కలిసి గంగమ్మగా సాధారణ జీవితం గడుపుతుంటుంది. తన నాన్నమ్మ అంటే రాజుకు ప్రాణం. వయసు ప్రభావం కారణంగా మతిమరుపు సమస్యలతో బాధపడుతూ ఉంటుంది గంగమ్మ. తనకు సంబంధించిన చాలా విషయాల్ని మరిచిపోయినా తన భర్త కనకరాజు (సంజయ్‌దత్)ని మాత్రం మరిచిపోదు. తనకు కలలో కనిపిస్తున్న తాతని ఎలాగైనా వెతికి తీసుకురమ్మని రాజాసాబ్‌ని కోరుతుంది. కానీ, కనకరాజే తనకున్న రకరకాల విద్యలతో నాన్నమ్మ, మనవడిని నర్సాపూర్ అడవిలోని రాజమహల్‌కి వచ్చేలా చేస్తాడు. ఒక దశలో ఇద్దరినీ చంపేయాలని కూడా అనుకుంటాడు. మార్మిక విద్యలెన్నో తెలిసిన కనకరాజుని రాజాసాబ్ ఎలా ఎదుర్కొన్నాడు? అసలు కనకరాజు గతమేమిటి?అతని లక్ష్యమేమిటి? రాజాసాబ్ జీవితంలోకి వచ్చిన ముగ్గురమ్మాయిలు భైరవి (మాళవిక మోహనన్), ÷-లబెస్సీ (నిధి అగర్వాల్) అనిత (రిద్ధి కుమార్) ఎవరు తదితర విషయాలను సినిమా చూసి తెలుసుకోవాల్సిందే.





# రజనీ, కమల్ మల్టీస్టారర్ మూవీ

## జైలర్ డైరెక్టర్ చేతికి ప్రాజెక్ట్ ?


ఇండియన్ సినిమా స్థాయిని మరో మెట్టు పైకి తీసుకెళ్లిన పాన్ ఇండియా చిత్రాలు, సీక్వెల్స్, ప్రీక్వెల్స్ హవా కొనసాగుతూనే ఉంది. ఇదే క్రమంలో మల్టీస్టారర్ సినిమాలపై కూడా ప్రేక్షకుల్లో ఆసక్తి పెరుగుతోంది. ముఖ్యంగా టాప్ స్టార్స్ కలిసి కనిపిస్తే ఆ సినిమా రిలీజ్‌కు ముందే భారీ హైప్ క్రియేట్ అవుతోంది. అలాంటి క్రేజీ కాంబినేషన్‌లో ఒకటిగా సూపర్ స్టార్ రజినీకాంత్ మరియు యూనివర్సల్ స్టార్ కమల్ హాసన్ కలిసి నటించే సినిమా గత కొన్నాళ్ల క్రితం ఒక్కసారిగా సెన్సేషన్‌గా మారిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ ఇద్దరు లెజెండరీ నటులు కలిసి కనిపించే ఒక ప్రాజెక్ట్ కమల్ హాసన్ నిర్మాణంలో ఉందన్న వార్తలు ఉన్నప్పటికీ, అది కాకుండా మరోసారి వీరి కలయికలో కొత్త సినిమా రాబోతుందన్న ప్రచారం ఇప్పుడు తమిళ సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా వినిపిస్తున్న బజ్ ప్రకారం, ఈ భారీ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌ను 'జైలర్' దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ టేకోవర్ చేసినట్టు టాక్ వినిపిస్తోంది. ఈ వార్తలకు మరింత బలం చేకూర్చేలా, నెల్సన్ ఇప్పటికే రజినీకాంత్ ? కమల్ హాసన్ కలయికపై ఒక అనౌన్స్‌మెంట్ కట్ లేదా కాన్సెప్ట్ వీడియో తరహా విజువల్‌ను సిద్ధం చేస్తున్నాడన్న రూమర్స్ కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ప్రాజెక్ట్ వెంటనే సెట్స్‌పైకి వెళ్లే అవకాశం మాత్రం తక్కువగా ఉందని సమాచారం. ప్రస్తుతం నెల్సన్ 'జైలర్ 2'తో పాటు ఇతర కమిట్‌మెంట్స్‌లో బిజీగా ఉండగా, తెలుగులో కూడా ఒక సినిమా చేయాల్సి ఉన్నట్టు తెలుస్తోంది. ఆ ప్రాజెక్ట్ పూర్తి అయిన తర్వాతే ఈ భారీ మల్టీస్టారర్‌పై దృష్టి పెట్టే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. రజినీకాంత్, కమల్ హాసన్ ఇద్దరూ ఒకే ఫ్రేమ్‌లో కనిపిస్తే అది కేవలం సినిమా మాత్రమే కాకుండా ఒక చరిత్రగా నిలుస్తుందన్న అభిప్రాయం అభిమానుల్లో ఉంది. అందుకే ఈ ప్రాజెక్ట్‌పై వస్తున్న ప్రతి చిన్న వార్త కూడా భారీ చర్చకు దారి తీస్తోంది.

## డిఫరెంట్ లుక్ లో ఆకట్టుకుంటున్న మిల్కీ బ్యూటీ!

ప్రముఖ మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలోనే భారీ పాపులారిటీ సొంతం చేసుకుంది. శ్రీ అనే సినిమాతో ఇండస్ట్రీలోకి వచ్చిన ఈమె ఆ తర్వాత హ్యాపీడేస్ సినిమాల్లో తన అద్భుతమైన నటనతో అందరి దృష్టిని ఆకట్టుకుంది. ఆ తర్వాత క్రమంగా రామ్ చరణ్ , అల్లు అర్జున్ , ప్రభాస్ , ఎన్టీఆర్ లాంటి దిగ్గజ హీరోల సరసన నటించి భారీ పాపులారిటీ సొంతం చేసుకుంది తమన్న. ఇకపోతే కెరియర్ పీక్స్ లో ఉండగానే కథల ఎంపిక విషయంలో తడబాటుపడ్డ తమన్న.. అవకాశాలను కోల్పోయింది. వచ్చిన అవకాశాలలో సక్సెస్ అందుకోలేక ఫ్లాపులు ఎదుర్కొంది. ఇకపోతే ఈమధ్య కాలంలో స్పెషల్ సాంగ్స్ చేస్తూ అలరిస్తున్న తమన్నా టాలీవుడ్, బాలీవుడ్ ఇండస్ట్రీలలో వరుసగా స్పెషల్ సాంగ్ లతో మరింత క్రేజ్ దక్కించుకుంది. అంతేకాదు ఐదు నిమిషాలకు ఐదు కోట్ల రేంజ్ లో రెమ్యూనరేషన్ తీసుకుంటూ అందరిని ఆశ్చర్యపరుస్తోంది. ఇదిలా ఉండగా తాజాగా ఇన్‌స్టాగ్రామ్ వేదికగా కొన్ని ఫోటోలు పంచుకుంది తమన్నా. అందులో డిఫరెంట్ లుక్కులో డిఫరెంట్ మూడ్ ప్రదర్శిస్తూ.. షేర్ చేసిన ఫోటోలు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ఈయన పంచుకున్న ఫోటోలలో ఒక ఫోటోలో డెనిమ్ డ్రెస్ ధరించి చేతిలో పువ్వులు పట్టుకొని చాలా ప్రశాంతంగా సహజ లుక్కుతో అందరిని ఆకట్టుకుంది .బ్లాక్ అండ్ మెరూన్ కాంబినేషన్ లో ఉన్న స్కర్ట్ ధరించి హుందాగా కనిపించింది. ఇంకొక ఫోటోలో క్రీం కలర్ డ్రెస్ ధరించి అందమైన జువెలరీతో తన మేకోవర్ ను ఫుల్ ఫిల్ చేసుకుంది ఈ ముద్దుగుమ్మ. మొత్తానికైతే మూడు భిన్నమైన ఫోటోలను పంచుకున్న తమన్నా అందులో తన అందాలతో అభిమానులను మెస్మరైజ్ చేసింది.

# ప్రతి ఇంట్లో కనిపించే కథ.. ఓం శాంతి శాంతి శాంతిః

'ఓం శాంతి శాంతి శాంతిః' మలయాళంలో విజయవంతమైన 'జయ జయ జయ జయహేకి రీమేక్ ఇది. బాగా చదువుకోవాలని, మంచి ఉద్యోగం చేయాలనీ భవిష్యత్తు గురించి చిన్నప్పట్నుంచీ ఎన్నో కలలు కన్న ఓ సగటు యువతి ప్రశాంతి అలియాస్ శాంతి (ఈషా రెబ్బా). కళాశాలలో జరిగిన ఓ సంఘటనతో చదువును అర్ధాంతరంగా ఆపేసి పెళ్లికి తలూపాల్సి వస్తుంది. కట్టుకున్న అమ్మాయిని తాను చదివిస్తానని మాట ఇచ్చి మరీ శాంతిని పెళ్లి చేసుకుంటాడు చేపల వ్యాపారి ఓంకార్ నాయుడు (తరుణ్ భాస్కర్). పెళ్లి తర్వాతైనా చదువుకోవచ్చనే సంతోషంతో నాయుడుతో కలిసి ఏడడుగులు వేస్తుంది. కానీ, ఆమె ఊహించింది ఒకటి, పెళ్లి తర్వాత జరిగింది మరొకటి. భర్త అనే అహంకారంతో తన కోపాన్నంతా భార్య శాంతిపై ప్రదర్శిస్తుంటాడు ఓంకార్. ఆయనకు కోపం వచ్చిందంటే భార్య చెంప పగిలిపోవల్సిందే. ఇదే విషయాన్ని కన్నవాళ్లతో చెబితే సర్దుకుపోవాలంటూ చెబుతారు. రోజు రోజుకీ భర్త పెట్టే హింస శ్రుతిమించడంతో ఒక రోజు శాంతి ఎదురు తిరుగుతుంది. తానూ చేయి చేసుకోగలననీ భర్తకు బాగా తెలిసేలా చేస్తుంది. దాంతో కంగుతిన్న ఓంకార్ ఏం చేశాడు? ఆ తర్వాత భార్యాభర్తల మధ్య యుద్ధం ఎలా సాగింది? ఇద్దరూ విడిపోయారా? లేదా? తదితర విషయాల్ని తెరపై చూసి తెలుసుకోవాల్సిందే. భాష, ప్రాంతంతో సంబంధం లేకుండా ప్రతి ఇంటినీ ఆలోచింపజేసే బలమైన కథ ఇది. ప్రతి అమ్మాయి, ప్రతి మహిళ తనని తాను చూసుకునే శాంతి పాత్ర ఇందులో ఉంది. ఓంకార్ నాయుడులా అహంకారం, ఆవేశంతో భార్యలపై చేయి చేసుకున్న మగాళ్లు ఈ సినిమా చూస్తున్నప్పుడు చాలామందే గుర్తుకొస్తారు. గోదావరి నేపథ్యాన్ని జోడించడమే ఈ సినిమాని ప్రత్యేకంగా నిలబెట్టింది. తెలుగుదనం ఉట్టిపడే పాత్రలు, గోదావరి యాస ఈ సినిమాని సొంతం చేసుకునేలా చేస్తాయి. అచ్చమైన గోదావరి ప్రాంతం నేపథ్యాన్ని ఆవిష్కరించే ప్రథమార్ధం ఈ సినిమాకి బలం. కట్టుబాట్ల పేరుతో అమ్మాయిల స్వేచ్ఛని, వాళ్ల హక్కుల్ని హరించి వేస్తున్నామని చెప్పకనే చెబుతాయి ఆ సన్నివేశాలు. ఓంకార్ నాయుడు పాత్ర పరిచయం తర్వాత సన్నివేశాలు సరదా సరదాగా మారిపోతాయి. బ్రహ్మాజీ నేపథ్యంలోని సన్నివేశాలు మరింత సందడిగా సాగుతాయి. శాంతి పాత్ర మెట్టినింట్లోకి అడుగుపెట్టాక అక్కడ ఆమెకి ఎదురయ్యే పరిణామాలు చాలా ఇళ్లల్లో చోటు చేసుకునే గృహ హింసకు అద్దం పట్టేలా ఉంటాయి. శాంతి ఎదురు తిరగడంతోనే కథ మలుపు తిరుగుతుంది. అక్కడ మొదలైన భార్యాభర్తల మధ్య యుద్ధం ఎక్కడ ముగిసిందన్నదే మిగతా సినిమా. ద్వితీయార్ధం తర్వాత ఆ ఇద్దరి మధ్య సాగే కొన్ని సన్నివేశాలు పునరావృతం అయినట్టుగా అనిపిస్తాయి. ఓంకార్ నాయుడు పాత్రలో తరుణ్ భాస్కర్ ఒదిగిపోయిన తీరు మెప్పిస్తుంది. ఆయన గోదావరి యాస పలికిన విధానం కూడా బాగుంది. భార్య తిరగబడేంత వరకూ ఒకలా కనిపించిన తరుణ్, భార్య చేతిలో తన్నులు తినప్పట్నుంచి ఆయన ప్రదర్శించిన నటన, హావభావాలు మరో స్థాయిలో ఉంటాయి. శాంతి పాత్రలో ఈషా రెబ్బా నటన ఈ సినిమాకి హైలైట్. ప్రథమార్ధంలో కళ్లతోనే భావాలు పలికిస్తూ పాత్రని పండించింది. భర్తని ఎదిరిస్తూ చేసే యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకుల్ని అలరించేలా ఉంటాయి. బ్రహ్మాజీతోపాటు ఇతర నటులు పాత్రల పరిధి మేరకు మంచి అభినయం ప్రదర్శించారు. సాంకేతికంగా సినిమా ఉన్నతంగా ఉంది. దర్శకుడు గోదావరి నేపథ్యాన్ని తెరపై చూపిస్తూ కథని చెప్పిన తీరు, నందకిశోర్ సంభాషణలు ఆకట్టుకునేలా ఉంటాయి.



Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986